JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజ్‌గిరి | మంగళవారం 31-03-2026
Medchal - Malkajgiri | Tuesday 31-03-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 303
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 303 | Pages : 8 | ₹: 5



6 లో



# నిషేధిత జాబితాలో కోటి ఎకరాలు

- భూ కబ్జాల పర్వం కొనసాగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు
- భూమి ఇవ్వకపోతే సజీవంగా పాతిపెడతామని బాధితులను బెదిరించారని ఆగ్రహం
- పొంగులేటి తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్

**జయభేరి, హైదరాబాద్, మార్చి 30 :**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ భూ కబ్జాల పర్వం కొనసాగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. వట్టినాగులపల్లిలో సతీశ్ షా కుటుంబానికి చెందిన 27 ఎకరాల భూమిపై మంత్రి పొంగులేటి కన్ను పడిందని కేటీఆర్ ఆరోపించారు. సుమారు రూ. 1,400 కోట్ల విలువ చేసే ఈ భూమిని దక్కించుకోవడానికి జేసీబీలతో వచ్చి గోశాలను, కాంపౌండ్ వాల్‌ను కూల్చివేశారని మండిపడ్డారు. భూమి ఇవ్వకపోతే సజీవంగా పాతిపెడతామని బాధితులను ...మిగతాది 2 లో

# ఇక కల్తీ మాఫియా ఖేల్ ఖతం

- ఆహార కల్తీని నియంత్రించడానికి రాష్ట్రంలో ఒక ప్రత్యేక వ్యవస్థ
- క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ప్రకటించి సన్నవడ్లు పండించాలని రైతులను ప్రోత్సహించాం
- ఇదే తరహాలో రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాలని లక్ష్యం
- వాణిజ్య ఇతర పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తాం
- ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి



**జయభేరి, హైదరాబాద్, మార్చి 30 :**

తెలంగాణలో ఆహార కల్తీని అరికట్టేందుకు, కల్తీ మాఫియాకు అడ్డుకట్ట వేసేందుకు ఈగల్, హైడ్రా తరహాలో ఒక అత్యాధునిక అత్యంత కఠినమైన వ్యవస్థను తీసుకురానున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రితో పాటు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొని భోజనం చేశారు. ముఖ్యమంత్రి మీడియాతో జరిపిన చిట్ చాట్‌లో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలులో ఉన్న ఆహార భద్రతా చట్టాలను, వ్యవస్థలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నామని సీఎం తెలిపారు. అధ్యయనం అనంతరం, పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రజా ఆరోగ్యంతో చెలగాటమాడే కల్తీ మాఫియాకు గట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈగల్, హైడ్రా తరహాలోనే ఈ కొత్త వ్యవస్థకు కూడా విస్తృత అధికారాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని కల్పించనున్నట్లు సమాచారం. రైతుల సమస్యలపైనా ముఖ్యమంత్రి స్పందించారు. పంటలకు ధర నిర్ణయించే అవకాశం రైతులకు లేకపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. రైతుల అవసరాలను ఆసరగా చేసుకుని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. ఈ దళారీ వ్యవస్థకు చరమగీతం పాడి, రైతులకు సరైన న్యాయం చేసేందుకే తాము కనీస మద్దతు ధర చట్టాన్ని తీసుకువచ్చామని గుర్తు చేశారు. ఈ చట్టం రైతు హక్కులను కాపాడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ ఉంచడంపై కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే పెద్ద నేరమని ఆయన వ్యాఖ్యానించారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, సామాన్య ప్రజలకు ఇబ్బంది ...మిగతాది 2 లో


2 లో

# ఇందిరా పార్కులో కబ్జాలకు హైడ్రా చెక్

- పాత స్కేటింగ్ రింగ్ స్థలాన్ని కాపాడిన హైడ్రా
- పార్కులో కలపాలంటూ హైడ్రా కమిషనర్ ఆదేశం

**జయభేరి, హైదరాబాద్, మార్చి 30:**

లోయర్ ట్యాంక్ బండ్‌లోని ఇందిరా పార్కు కబ్జాలకు హైడ్రా చెక్ పెట్టింది. పార్కులో వాకింగ్ ట్రాక్ లకు తోడు పిల్లలు ఆడుకునేందుకు చుట్టూ ఏర్పాటు చేసిన స్థలాల కబ్జాలపై హైడ్రా కన్నెర్రజేసింది. పాత స్కేటింగ్ రింగ్ కబ్జాకు గురౌతోందని ప్రజావాణిలో వాకర్స్ నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు సోమవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నిర్మాణ సామగ్రితో పాటు.. ఇందిరాపార్కు లోపలి వైపు ఉన్న ప్రహరీ తొలగించడాన్ని సీరియస్గా పరిగణించారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నిర్మాణాలను ఆపించి.. ప్రహరీని పునరుద్ధరించాలని ఆదేశించారు. కొత్త స్కేటింగ్ రింగ్ అందుబాటులోకి వచ్చినందున.. పాతదాన్ని ఇందిరాపార్కులో విలీనమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ప్రతి ఒక్కరికీ ఇల్లు


2 లో

- సౌర శక్తితో ఉచిత విద్యుత్
- సంక్షేమంలో సూపర్ హిట్
- మత్స్యకారులకు భరోసా
- అమరావతికి చట్టబద్ధత.. పోలవరం పూర్తి.. సీఎం బాబు

**జయభేరి, అమరావతి :**

2029 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో ఇల్లు లేని పేదవాడు ఉండకూడదనేదే తమ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నాయుడుపేట వేదికగా చంద్రబాబు ఒకేసారి 2.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కేవలం ఇళ్లు ఇవ్వడమే కాకుండా సౌర విద్యుత్, ఉచిత గ్యాస్ వంటి ఆధునిక వసతులతో పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పేదరిక నిర్మూలనతో పాటు ప్రతి పేదవాడికి ఆత్మగౌరవంతో కూడిన నివాసాన్ని అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా శనివారం నాయుడుపేటలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఎం చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా 30 ప్రాంతాల్లో నిర్మించిన 2,50,893 ఇండ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గేటెడ్ కమ్యూనిటీ తరహాలో పార్కులు, అంతర్గత రోడ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీల వంటి మౌలిక సదుపాయాలతో ఈ గృహ సముదాయాలను నిర్మించడం విశేషం.



2 లో

# హేట్ స్పీచ్ బిల్లు వాయిదా

- వాట్సాప్ గ్రూప్ సభ్యులందరిపై చర్యలు తీసుకునేలా ఉంది: బీజేపీ
- బ్రిటిషన్ కాలంలో ఇలాంటి చట్టాలు: సీపీఐ
- ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్‌కు ఎలాంటి భంగం లేదు: పొన్నం

**జయభేరి, హైదరాబాద్, మర్చి 30 :**

తెలంగాణ రాజకీయాల్లో హేట్ స్పీచ్ బిల్లు హాట్ టాపిక్‌గా మారింది. హేట్ స్పీచ్ పేరుతో వాక్ స్వేచ్ఛపై హక్కుపై కత్తిని పెడుతోందని విపక్షాలు విమర్శిస్తుండగా మానవ హక్కులను హరించే అంశాలు ఈ బిల్లులో లేవని ప్రభుత్వం చెబుతోంది. ఈ బిల్లులోని నిబంధనలు, శిక్షలు, పౌరహక్కులపై సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. దీంతో ప్రభుత్వం ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి సిఫార్సు చేసింది. మరో వైపు శాంతిభద్రతల పేరుతో సోషల్ మీడియాపై నియంత్రణ చేసేలా ప్రభుత్వం బిల్లును తీసుకువస్తోందని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.



2 లో



# గ్యాస్ సిలిండర్ బ్లాక్ మార్కెట్ గుట్టు రట్టు

- స్మశాన వాటికలో సిలిండర్ల నిల్వ

**జయభేరి, హైదరాబాద్ :**

బ్లాక్ మార్కెట్ లో కమర్షియల్ సిలిండర్ అమ్ముతున్న ముఠా గుట్టును టాక్స్ ఫోర్స్ పోలీసులు రట్టు చేసారు. పంజగుట్ట స్మశాన వాటికలో సిలిండర్లతో నిల్వ చేసిన వైనం బయటపడింది. టాక్స్ ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాత్ మాట్లాడుతూ బంజారాహిల్స్ పీఎస్ లో ఈ దందాకి పాల్పడుతున్న 10 మంది పైన కేసు నమోదు చేసామని వెల్లడించారు. గ్యాంగ్ నుండి 420 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. బ్లాక్ దందాకి మెట్రో హెచ్ పి గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం పాల్పడుతున్నట్లు గుర్తించారు. రెండు ఆటోలు, రెండు బొలెరో, ఓమినీ, రెండు డీసీఎంలు స్వాధీనం చేసుకున్నారు. 2100 వేల సిలిండర్లు 6 వేలకు అమ్ముతున్న వైనం గుర్తించారు. గ్యాస్ సప్లై లేదనే ప్రచారాన్ని నమ్మొద్దు. కావాలనే ఈ రూమర్‌ని ప్రచారం చేస్తున్నారని అయన అన్నారు.

# నామ మాత్రంగా కమ్యూనిస్ట్ పార్టీలు

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఇక కల్తీ మాఫియా ఖేల్ ఖతం

కలిగించే అక్రమ నిల్వదారులను వదిలిపెట్టబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**సన్నబియ్యం పథకం అందుకే..**

అసెంబ్లీ వేదికగా సన్నబియ్యం పథకం ప్రస్థానాన్ని, దాని విజయాలను వివరిస్తూ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో విజయభాస్కర్ రెడ్డి హయాంలో ప్రారంభమై, ఎన్టీఆర్ కాలంలో విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లిన కిలో బియ్యం పథకం దశాబ్దాలుగా దొడ్డు బియ్యం పంపిణీతోనే కొనసాగిందని ఆయన గుర్తు చేశారు. అయితే, ఆ బియ్యాన్ని ప్రజలు తినలేకపోవడం వల్ల అవి మాఫియా చేతుల్లోకి వెళ్తున్నాయని గ్రహించి, పేదలకు నాణ్యమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం 'సన్నబియ్యం' పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఇందుకోసం రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చి సన్నవడ్ల సాగును ప్రోత్సహించామని, తద్వారా రాష్ట్రంలోని 86 శాతం మంది ప్రజలకు సుమారు 3.39 కోట్లు మందికి లబ్ధి చేకూరుతోందని వెల్లడించారు. ఈ పథకం పంపిణీ నేటితో ఏడాది పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని, బ్లాక్ మార్కెట్ మాఫియాకు అడ్డుకట్ట పడిందని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే తమ తదుపరి లక్ష్యమని, అందుకే రైతులకు పంట మార్పిడి, వాణిజ్య పంటలపై అవగాహన కల్పిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## నిషేధిత జాబితాలో కోటి ఎకరాలు

బెదిరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు రక్షణ కల్పించిన నిజాయతీగల పోలీస్ అధికారి అజీబుల్లా ఖాన్‌ను మరుసటి రోజే బదిలీ చేయడం ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు నిదర్శనమని విమర్శించారు.రాష్ట్ర వ్యాప్తంగా కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కేటీఆర్ ఆరోపించారు. నిజాం కాలం నాటి భూములను కూడా ఈ జాబితాలోకి చేర్చి, రైతులను భయాందోళనలకు గురిచేసి, భూములు గుంజుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు త్వరలోనే గవర్నర్‌ను కలుస్తామని, అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.మంత్రి పొంగులేటి అక్రమ మైనింగ్, భూ కుంభకోణాలపై కేవలం సీబీసీఐడీ విచారణ సరిపోదని, వెంటనే సభా సంఘాన్ని (హౌస్ కమిటీ) వేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మంత్రి పదవిలో ఉంటే విచారణ నిష్పక్షపాతంగా జరగదని... పొంగులేటి తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీబీసీఐడీ విచారణ పేరుతో మంత్రిని కాపాడే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు.ఇదే సమయంలో పోలీసులకు కేటీఆర్ హెచ్చరికలు జారీ చేశారు. "పాలకుల ఒత్తిడికి లొంగి అక్రమాలకు సహకరిస్తే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదు" అని హెచ్చరించారు. అక్రమాలకు అండగా నిలవవద్దని, ప్రజల పక్షాన ఉండాలని పోలీసులను కోరారు. బాధితుల పేర్లు బయటపెట్టకుండా బీఆర్ఎస్ లీగల్ సెల్ ద్వారా వారికి ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. భూ కబ్జాలకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఈ పర్యటనలో కేటీఆర్ వెంట పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## హేట్ స్పీచ్ బిల్లు వాయిదా

దీంతో ఈ బిల్లులో ప్రభుత్వం, ప్రతిపక్ష వాదనలేంటో ఓ లుక్కేద్దాం.

**వాట్సాప్ గ్రూప్ సభ్యులందరిపై చర్యలు తీసుకునేలా ఉంది: బీజేపీ**

శాంతిభద్రతల పేరుతో తీసుకువస్తున్న హేట్ స్పీచ్ బిల్లును తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, ఈ బిల్లు ప్రజాస్వామ్యానికి హానికరం అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ బిల్లులోని శిక్షలకు ముందస్తు బెయిల్ ఉండదని, రాజకీయ ప్రత్యర్థులను నియంత్రించేందుకు తీసుకువస్తున్న ఈ బిల్లు ఇవాళ మీకు బాగానే అనిపించవచ్చు. కానీ అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని మీరు ప్రతిపక్షంలోకి రాగానే ఈ బిల్లును వ్యతిరేకించే అవకాశం ఉందన్నారు. బతికున్నవారిమీదనే భరోసా లేని ఈ సమాజంలో చనిపోయిన వ్యక్తుల మీదనో, నిజాంపాలకుల మీదనో, మరెవరో రచయితల మీదనో మాట్లాడినా కూడా కేసులు పెట్టేలా నిబంధనలు ఇందులో ఉన్నాయన్నారు. ఇలాంటి చట్టాలు చేసే ముందు ఆలోచించుకోవాలన్నారు. ఇందులోని సెక్షన్ 4 ప్రజాస్వామ్యానికి డెత్ వారెంట్ లాంటిదన్నారు. ఏదైనా వాట్సాప్ గ్రూప్ లో అడ్మిన్ వేసే పోస్టుకు గ్రూప్ లోని సభ్యులందరిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. దీనిపై ఎలాంటి క్లారిటీ లేదన్నారు.

**బ్రిటిషన్ కాలంలో ఇలాంటి చట్టాలు: సీపీఐ**

ఈ హేట్ స్పీచ్ బిల్లును తాను వ్యతిరేకిస్తున్నానని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇది రాజకీయాలతో సంబంధించినదని కాదని భావ స్వేచ్ఛ, భాషా, కవులు, కళాకారులు, సాంస్కృతిక రంగాలపై అన్ని రకాలుగా దాడులు చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. బ్రిటీష్‌కాలంలో ఇటువంటి బిల్లులు ఉండేవని ఈ బిల్లులో సరైన స్పష్టం తేలదన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం చేతిలో ప్రజాస్వామ్యం బంధిగా ఉందని దీనికి తోడు ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా తోడైతే ఇక చెప్పుకోవడానికి ఏమీ ఉండదన్నారు. ఉపా చట్టం కింద ఎవరినైనా ఎప్పుడైనా లోపల పెడుతున్నారు. ఎన్ఐఏ ఎవరినైనా అరెస్టు చేస్తున్నారు.

**ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్‌కు ఎలాంటి భంగం లేదు: పొన్నం**

సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టేలా సాగుతున్న విద్వేషపూరిత ప్రసంగాలను అరికట్టేందుకు ప్రతిపాదించిన ఈ బిల్లుపై ఇవాళ సభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా సభ్యుల నుంచి వ్యక్తం అయిన సందేహాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ వివరణ ఇచ్చారు. మానవ హక్కులను హరించే విషయాలు ఈ బిల్లులో లేవని స్పష్టం చేశారు. కక్ష సాధింపుకోసమే, ఎవరికో అన్యాయం చేసే ఉద్దేశం లేదన్నారు. ప్రజాస్వామ్యంలో విలువలు ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ బిల్లును తీసుకువచ్చామన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 కు సంబంధించిన ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్ కు ఎలాంటి భంగం కలిగించదన్నారు. ఈ బిల్లు విషయంలో విపక్ష సభ్యుల ఆలోచనలో పొరపాటు ఉందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించడం చాలా తప్పు అన్నారు. ఈ బిల్లులోని అంశాలు అందరికీ వర్తిస్తాయన్నారు.

## ఇందిరా పార్కులో కబ్జాలకు హైడ్రా చెక్

ఇందిరాపార్కులో కొత్త స్కేటింగ్ రింగ్ అందుబాటులోకి రావడంతో గతంలో ఉన్న చిన్న స్కేటింగ్ రింగ్ ఖాళీగా ఉంది. ఇక ఈ స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది. సమ్మర్ క్యాంప్ పేరుతో కరాటే నేర్పుతానని సఫీ అనే వ్యక్తి ఎంటర్ అయ్యాడు. వేసవి కాలం తర్వాత కూడా కరాటే శిక్షణ కేంద్రంగా వినియోగించుకుంటూ పిల్లల వద్ద ఫీజులు వసూలు చేస్తున్నాడు. అక్కడితో ఆగకుండా.. సామ్రాజ్యాన్ని విస్తరించాలని ప్రయత్నించాడు. ఎమ్మెల్యే నిధులు కేటాయించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యేను కలిశాడు. ఈమేరకు రూ. 30 లక్షలు కేటాయించాలంటూ స్థానిక ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ కు ప్రతిపాదనలు పంపారు. జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇచ్చి సంబంధిత శాఖ నుంచి అనుమతులు తీసుకురావాలని సూచించారు. అనుమతులుంటే నిధులు మంజారు చేస్తామన్నారు.

**అనుమతుల గురించి ఆగకుండా..**

ఈ అనుమతులు వచ్చేసరికి ఆలస్యం అవుతుందని భావించాడో.. లేక అనుమతులవే వస్తాయి.. ఈ లోగా పనులు కానిచ్చేద్దామనుకున్నాడో ఏమో కాని.. కాంట్రాక్టర్ రవీందర్ రెడ్డికి ఆ పనులు అప్పగించాడు. అందులో నిర్మాణాలు చేపట్టడానికి సంబంధిత స్టీల్ రాడ్డులు, నిర్మాణ సామగ్రీ డంప్ చేశాడు. చిన్న స్కేటింగ్ రింగ్లోకి జేసీబీ వెళ్లేందుకు వీలుగా ప్రహరీని తొలగించాడు. ఇందిరా పార్కు నిర్వహణకు చెందిన (జీహెచ్ ఎంసీ) కార్యాలయం చెంతనే ఇదంతా జరుగుతున్నా.. పట్టించుకోవడంలేదని భావించిన వాకర్స్ హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైడ్రా క్షేత్ర స్థాయిలో పరిశీలించి.. జీహెచ్ ఎంసీ క్రీడా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ని సంప్రదించింది. దీంతో కదలిక మొదలైంది. ఇందిరాపార్కు లోపలి వైపు నుంచి స్కేటింగ్ రింగులోకి వెళ్లేందుకు వీలుగా ప్రహరీని కూల్చిన రవీందర్ రెడ్డిపై దోమలగూడ పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేశారు. సోమవారం హైడ్రా కమిషనర్ ఈ పరిణామాలన్నిటినీ పరిశీలించి.. కొత్త స్కేటింగ్ రింగ్ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో పాత స్థలాన్ని ఇందిరా పార్కులో కలిపేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# నామమాత్రంగా కమ్యూనిస్ట్ పార్టీలు



భారత రాజకీయ చరిత్రలో ఒకప్పుడు శక్తివంతమైన శక్తిగా, పేద ప్రజల గొంతుకగా నిలిచిన కమ్యూనిస్టు పార్టీలు ఇప్పుడు నామమాత్రంగా మిగిలాయి. ప్రజల తరపు, కార్మికుల తరపున ఎన్నో పోరాటాలుచేసి, హక్కుతు సాధించిన కమ్యూనిస్టులను ఇప్పుడు పట్టించుకునేవారు తగ్గిపోతున్నారు. ఉద్యమాల వరకు మాత్రమే వాటిని ఆదరిస్తున్నారు. ప్రజా ప్రదినిధులుగా చట్ట సభలకు మాత్రం పంపడం లేదు. ఇందుకు కారణం వారు అనుసరిస్తున్న బూర్జువా విధానాలే. తాజాగా సీపీఎం (కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా - మార్క్సిస్ట్) నేత ప్రకాశ్ కారత్ విజయవాడలో చేసినవ్యాఖ్యలు ఈ పార్టీల పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ప్రధాని మోదీ విదేశాంగ విధానంపై, ముఖ్యంగా పశ్చిమాసియా యుద్ధంపై భారత వైఖరిపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. కానీ ఈ విమర్శలు వాస్తవ భౌగోళిక రాజకీయాలకు దూరంగా, ఆదర్శవాదపు కోణంలోనే ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ప్రధాని మోదీ అమెరికాకు సాగిలపడ్డారని కారత్ ఆరోపించారు.

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులను భారత్ ఖండించకపోవడాన్ని ఆక్షేపించారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హత్యను ఖండించకపోవడంపై విమర్శలు చేశారు. పశ్చిమాసియా యుద్ధంపై భారత వైఖరిని 'దారుణం'గా ఉందని అభివర్ణించారు. ఈ వ్యాఖ్యలు వినడానికి భావోద్వేగపూరితంగా అనిపించినా, వాస్తవ భౌగోళిక రాజకీయాల దృష్ట్యా ఇవి అప్రాయోగికం. భారత్ ప్రస్తుతం బహుళ ధ్రువాల విదేశాంగ విధానాన్ని అనుసరిస్తోంది. ఇరాన్‌తో మంచి సంబంధాలు ఉన్నప్పటికీ, అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యం, ఇజ్రాయెల్‌తో రక్షణ సహకారం దేశ జాతీయ ప్రయోజనాలకు కీలకం. రష్యాతో భారత్ స్నేహంపై ఇప్పటికే అమెరికా అసంతృప్తిగా ఉంది. టారిఫ్‌లు, ఆర్థిక ఒత్తిళ్లు విధిస్తోంది. ఇరాన్ దాడులను ఖండిస్తే అమెరికా మరింత ఆగ్రహించి, పాకిస్తాన్‌ను చేరదీసే ప్రమాదం ఉంది. ఇక ఆపరేషన్ సిందూర్ సమయంలో ఇజ్రాయెల్ భారత్‌కు ఆయుధ సాయం అందించింది. ఇరు దేశాల మధ్య రక్షణ, వ్యవసాయం, సాంకేతిక రంగాల్లో గాఢమైన సహకారం ఉంది. ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తే ఈ సత్సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉంది.

ఇరాన్‌తో భారత్‌కు చమురు సరఫరా, చాబహార్ ఓడరేవు వంటి వ్యూహాత్మక అవసరాలు ఉన్నాయి. కానీ కశ్మీర్ అంశంలో ఇరాన్ పాకిస్తాన్‌కు మొగ్గు చూపడం గమనార్హం. కశ్మీరీలు ఇరాన్ ప్రజలకు విరాళాలు పంపించగా, ఇరాన్ కశ్మీర్‌ను, భారత్‌ను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని ట్వీట్ చేసింది. దీనికి పాకిస్తాన్ అభ్యంతరం చెప్పగానే ఆ ట్వీట్‌ను తొలగించింది. ఇది ఇరాన్ ప్రాధాన్యతలను స్పష్టం చేస్తుంది.రాజకీయాల్లో కమ్యూనిస్టు పార్టీలు ఒకప్పుడు బలంగా ఉండేవి. ఈశాన్య రాష్ట్రాలు, కేరళలో అధికారంలో ఉండేవి. కానీ కాలానుగుణంగా మారకపోవడం, పాత విధానాలనే అవలంబిస్తుండడంతో కమ్యూనిస్టులకు ఆదరణ తగ్గుతోంది. 2004లో సీపీఎంకు 40కిపైగా ఎంపీలు ఉన్నారు. నాడు యూపీఏ ప్రభుత్వం సీపీఎం మద్దతుతోనే ఏర్పడింది. కానీ 2014 నాటికి 9 సీట్లకు పడిపోయింది.

2019లో కేవలం 3 సీట్లు గెలిచింది. 2024లో 4 స్థానాల్లో విజయం సాధించింది.కమ్యూనిస్టు పార్టీలు ఇప్పటికీ 20వ శతాబ్దపు ఆదర్శాలతోనే బతికున్నాయి. మారుతున్న భౌగోళిక రాజకీయాలను, వ్యూహాత్మక అవసరాలను అర్థం చేసుకోలేక పోతున్నాయి. ప్రపంచీకరణ, సాంకేతిక విప్లవం, భారత ఆర్థిక వ్యవస్థ మార్పులకు అనుగుణంగా తమ సిద్ధాంతాలను మార్చుకోలేదు. దేశ అభివృద్ధిలో నిర్మాణాత్మక పాత్ర పోషించే సామర్థ్యం కమ్యూనిస్టులకు ఉంది. కానీ వారు ఎప్పుడూ ప్రతిపక్ష పాత్రకే పరిమితమయ్యారు. విమర్శలు చేయడం తప్ప, పరిష్కారాలు సూచించడంలో విఫలమయ్యారు. 'నేలవిడచి సాము చేయడం' వల్ల ప్రజాదరణ కోల్పోయారు. సీపీఎం, సీపీఐల మధ్య మాత్రమే కాకుండా, పార్టీల లోపల కూడా తీవ్ర విభేదాలు ఉన్నాయి.ఒకప్పుడు కార్మికులు, రైతాంగం మధ్య బలమైన పునాది ఉన్న కమ్యూనిస్టు పార్టీలు, ఇప్పుడు ఆ వర్గాల నుంచి కూడా దూరమయ్యాయి. ట్రేడ్ యూనియన్ ఉద్యమాలు, రైతు పోరాటాల్లో పార్టీల పాత్ర క్షీణించింది. భారత్ కమ్యూనిస్టు విధానాలను అనుసరిస్తే చాలా దేశాలకు దూరమయ్యే ప్రమాదం ఉంది.

## ప్రతి ఒక్కరికీ ఇళ్లు

**2029 నాటికి అందరికీ ఇళ్లు**

2029 నాటికి రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలు ఉండకూడదన్నదే తమ సంకల్పమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గత పాలకులు ఐదేళ్లలో కేవలం 6.5 లక్షల ఇళ్లు మాత్రమే కడితే.. తమ ప్రభుత్వం ఈ 21 నెలల్లోనే 5.5 లక్షల ఇళ్లను పూర్తి చేసి పేదలకు అప్పగించిందన్నారు. రానున్న కాలంలో మరో 4.5 లక్షల ఇళ్లను నిర్మిస్తామన్న సీఎం.. ఈ ఏడాది జూన్ నాటికి 2 లక్షలు, సెప్టెంబర్ నాటికి మరో 1.60 లక్షల ఇళ్లలో గృహ ప్రవేశాలు చేయిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**సౌర శక్తితో ఉచిత విద్యుత్..**

పేదలపై విద్యుత్ భారం తగ్గించేందుకు ప్రతీ ఇంటిపైనా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దీనివల్ల పేదలకు ఉచితంగా విద్యుత్ అందడమే కాకుండా విద్యుత్ ఆదా చేసే ఉపకరణాలను అందించేందుకు ఈఎస్ఎస్ఎల్ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. మొత్తం 10 లక్షల ఇళ్లకు ఈ ఉపకరణాలను అందించాలని సీఎం లక్ష్యంగా పెట్టుకున్నారు.

**సంక్షేమంలో సూపర్ హిట్..**


దీపం 2.0 స్కీమ్ ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, భవిష్యత్తులో పైపుల ద్వారా ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. స్త్రీశక్తి ద్వారా మహిళలకు, దివ్యాంగ శక్తి ద్వారా దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. వచ్చే ఏడాది నాటికి 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, 2029 నాటికి చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని తెలిపారు.

**అమరావతికి చట్టబద్ధత.. పోలవరం పూర్తి**

గత పాలకులు మూడు ముక్కలాటతో రాజధానిని ధ్వంసం చేశారని విమర్శించిన సీఎం, అమరావతికి చట్టబద్ధత కల్పించేలా అసెంబ్లీలో తీర్మానం చేశామని తెలిపారు. అలాగే గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు. "సుపరిపాలన అందించడమే నా ధ్యేయం. ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు ఇచ్చేలా వ్యవస్థను గాడిలో పెట్టాం. అయితే ప్రజలకు సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు. నాయుడుపేటలో రిజిస్ట్రేషన్ విభాగం సేవలు సరిగా లేవని ఫిర్యాదులు వచ్చాయి. ఏప్రిల్ నుండి రాష్ట్రవ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాను" అని అధికారులను హెచ్చరించారు.

**మత్స్యకారులకు భరోసా**

స్థానిక మత్స్యకారుల ప్రయోజనాలను కాపాడతామని, ఇతర ప్రాంతాల వారు వచ్చి వేట సాగించకుండా నిఘా పెంచేందుకు రెండు ప్రత్యేక బోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వేట నిషేధ సమయంలో ఇచ్చే ఆర్థిక సాయాన్ని రూ.20 వేలకు పెంచినట్లు గుర్తు చేశారు.



### ఈ దీవిపై ఏ క్షణంలోనైనా దాడి చేస్తామంటున్న ట్రంప్

## అమెరికా కన్ను దీనిపై ఎందుకు పడింది?

ఇరాన్ తీరానికి సమీపంలో ఉన్న ఒక చిన్న ద్వీపంపై మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమైన ప్రధాన చమురు టెర్మినల్ ఈ ద్వీపంలోనే ఉంది. ఆదివారం 'ఫైనాన్షియల్ టైమ్స్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, తాను ఇరాన్ చమురును చేజిక్కించుకోవాలని అనుకుంటున్నట్లు, ఖార్గ్ ఐలాండ్‌ను స్వాధీనం చేసుకునే విషయం పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఈ ఆపరేషన్ అంటే, 'మేం కొంతకాలం అక్కడ (ఖార్గ్ ఐలాండ్‌లో) మకాం వేయాల్సి వస్తుంది' ట్రంప్ పేర్కొన్నారు. ద్వీపంలోని ప్రతి సైనిక లక్ష్యాన్ని అమెరికా దళాలు 'పూర్తిగా ధ్వంసం చేశాయని', అయితే అక్కడి చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకోకుండా అమెరికా సైన్యం వేచి ఉందని మార్చి 13న ట్రంప్ చెప్పారు. ఇరాన్ తీరానికి దక్షిణాన ఉన్న ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన షిప్పింగ్ చానళ్లలో ఒకటైన 'హార్ముజ్ జలసంధి'ని తిరిగి తెరిపించేలా ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు.. ఈ ద్వీపాన్ని ఆక్రమించడం లేదా దిగ్బంధించే ప్రణాళికలను ట్రంప్ ప్రభుత్వం పరిశీలిస్తోందని, ఈ వ్యవహారంతో సంబంధమున్న నలుగురు వ్యక్తులను ఉటంకిస్తూ 'ఆక్సియోస్' వార్తాసంస్థ వెల్లడించింది.

**అమెరికా స్వాధీనం చేసుకుంటుందా?**

ఇరాన్‌కు చెందిన ఖార్గ్ ఐలాండ్‌ను అమెరికా దళాలు ఎప్పుడైనా తమ ఆధీనంలోకి తీసుకోవచ్చనే ఊహాగానాలు కొంతకాలంగా వినిపిస్తున్నాయి. దీన్ని స్వాధీనం చేసుకుంటే, ఇరాన్ చమురు ఎగుమతులను అడ్డుకోవడమే కాకుండా, అక్కడి నుంచి ఇరాన్ ప్రధాన భూభాగంపై దాడులు చేయడానికి ఒక వేదికగా కూడా ఉపయోగపడుతుంది.

"మేం ఖార్గ్ ఐలాండ్‌ను స్వాధీనం చేసుకోవచ్చు లేదా చేసుకోకపోవచ్చు. మా ముందు చాలా ఆప్షన్లు ఉన్నాయి" అని అన్నారు. పెంటగాన్ అధికారులు ఇరాన్‌లోకి భూదళాలను పంపేందుకు వివరణాత్మక ఏర్పాట్లు చేశారని బీబీసీ భాగస్వామి 'సీబీఎస్ న్యూస్'కు సమాచారం అందింది. ఈ ఊహాగానాలకు బలాన్ని చేకూరుస్తూ, 'యూఎస్ఎస్ ట్రిపోలి' యుద్ధనౌక నేతృత్వంలోని విభాగంలో భాగంగా మరో 3,500 మంది అమెరికా నావికులు, మెరైన్లు మధ్యప్రాచ్యానికి చేరుకున్నట్లు శనివారం యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. సైన్యం మోహరింపు లేదా అమలు చేయాలనుకుంటున్న ప్రణాళికలపై పెంటగాన్, వైట్‌హౌస్ స్పందించడానికి నిరాకరించినప్పటికీ, తమ ముందు ఆప్షన్లున్నాయని పదేపదే స్పష్టం చేస్తున్నాయి. ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడం వల్ల 'ఇరానియన్ రివల్యూషనరీ గార్డ్ కోర్' ఆర్థిక మూలాలను సమర్థవంతంగా దెబ్బతీయవచ్చని, ఇది వారి యుద్ధ సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుందని బీబీసీ సెక్యూరిటీ బ్రీఫ్ కార్యక్రమంలో భద్రతా విశ్లేషకుడు మైకీ కే అభిప్రాయపడ్డారు. జలసంధిని తెరిచి ఉంచేలా ఇరాన్‌ను బలవంతం చేయడానికి ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుని ఒక 'అస్త్రంలా' ఉపయోగించవచ్చని అమెరికా భావిస్తున్నట్లు 'స్కూల్ ఆఫ్ వార్' పాడ్‌కాస్ట్ హోస్ట్ ఆరోన్ మెక్లీన్ తెలిపారు. ఖార్గ్ ఐలాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు అమెరికా చేసే ఏ ఆపరేషన్ అయినా పరిమాణంలో చిన్నదే అయినప్పటికీ, అది సవాలుతో కూడుకున్నదని మెక్లీన్ అభిప్రాయపడ్డారు. అమెరికా దళాలు నౌకల ద్వారా లేదా గగనతలం నుంచి భారీ దూరం ప్రయాణించి అక్కడ దిగాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

మరోవైపు, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగేర్ గాలిబాఫ్ హెచ్చరిస్తూ.. తమ దళాలు "అమెరికా సైనికుల కోసం ఎదురుచూస్తున్నాయని", ఇరాన్ భూభాగంలోకి ప్రవేశించే ఏ అమెరికా దళం పైనైనా "నిప్పుల వర్షం" కురిపిస్తామని చెప్పారు. గతంలో ఒక ఇరాన్ సైనిక అధికారి మాట్లాడుతూ, భూతల దాడి జరిగితే ఎర్ర సముద్రంలోని షిప్పింగ్‌ను లక్ష్యంగా చేసుకుంటామని స్థానిక మీడియాకు తెలిపారు. అమెరికా ముప్పు నేపథ్యంలో ఇరాన్ గత కొన్నివారాలుగా ఖార్గ్ ఐలాండ్‌లో అదనపు సైనిక సిబ్బందిని, గగనతల రక్షణ వ్యవస్థలను మోహరించి రక్షణను బలోపేతం చేసినట్లు సీఎన్ఎన్ తెలిపింది. అమెరికా నిఘా వర్గాల సమాచారం ప్రకారం.. తెహ్రాన్ ఈ ద్వీపానికి అదనపు ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే క్షిపణులను పంపింది, చుట్టుపక్కల నీటిలో యాంటీపర్సనల్, యాంటీఆర్మర్ మైన్లను (మైన్ ట్రాప్స్) ఏర్పాటు చేసింది.


**వ్యూహాత్మక స్థానం**

ఖార్గ్ దీవి చమురు ఎగుమతి కేంద్రంగా మారిన నాటినుంచి తెహ్రాన్‌కు వ్యూహాత్మక కేంద్రంగా మారింది. "అమెరికాకు ఇప్పుడు స్పష్టంగా తెలుస్తున్న విషయం ఏంటంటే, ఇరాన్ చమురును మార్కెట్ నుంచి తొలగించలేదు లేదా దాని మౌలిక సదుపాయాలకు కోలుకోలేని నష్టాన్ని కలిగించలేదు" అని క్విలియం అన్నారు. ప్రస్తుతం బ్యారెల్ ధర 120 డాలర్ల (సుమారు రూ. 9,960)వద్ద ఉందని, ఖార్గ్ ద్వీపంపై దాడి జరిగితే అది 150 డాలర్ల (సుమారు రూ. 12,500) వరకు పెరిగే అవకాశం ఉందని క్విలియం అభిప్రాయపడుతున్నారు. "అదే జరిగితే, ఇప్పట్లో ఈ ధరలు తగ్గే అవకాశం లేదు" అని ఆయన అన్నారు.

'ఈ ద్వీపంపై దాడి చేయకుండా, స్వాధీనం చేసుకోవాలని పెంటగాన్ సలహాదారులు సూచించారు. వారు(ఇరాన్) చమురును అమ్మలేకపోతే, పాలన కొనసాగించడానికి డబ్బు ఉండదు అని సలహాదారులలో ఒకరు సూచించారు' అని బ్రిటిష్ వార్తాపత్రిక ది గార్డియన్ పేర్కొంది. అయితే, ముందుగా పరిగణించవలసిన అంశాలు చాలా ఉన్నాయని క్విలియం చెబుతున్నారు. దీన్ని స్వాధీనం చేసుకోవడానికి పదాతి దళాలను ఉపయోగించడం మాత్రమే కాకుండా, అక్కడ అభివృద్ధి చేయాల్సిన ప్రాజెక్ట్ భవిష్యత్తుపై పడే ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

"అమెరికా ఏం చెప్పిందంటే.. ఇరాన్ ప్రస్తుత పాలనను అంతమొందించి, ప్రజాస్వామ్య స్థాపన. కానీ అది విజయవంతం కావాలంటే, ఖార్గ్ దీవి సక్రమంగా పనిచేయడం అవసరం" అని క్విలియం వివరించారు. కానీ, ఈ నేపథ్యంలో, ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల నడుమ ఈ దీవిపై దాడి జరిగే అవకాశం లేదని కూడా విశ్లేషకులు చెప్పలేకపోతున్నారు. "ఇప్పటివరకు, ఏ అమెరికా అధ్యక్షుడు కూడా ఖార్గ్ ద్వీపంపై దాడి చేయడానికి ధైర్యం చేయలేదు. అందులో పెద్దగా లాజిక్ లేకపోయినా, ఇటీవలి నెలల్లో జరిగిన పరిణామాలను చూస్తే దాడి జరగదని చెప్పలేం" అని ఆయన అన్నారు.

# యాదగిరిగుట్ట ఆలయంలో బదిలీల వేటు



- పాతుకుపోయిన అధికారుల్లో వణుకు

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 30 :**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నర సింహస్వామి ఆలయంలో ఏళ్ల తరబడి తిష్టవేసిన అధికారులపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఉక్కుపాదం మోపింది. రాజకీయ అండదండలతో దేవస్థానాన్ని అడ్డాగా మార్చుకున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం, ప్రక్షాళన పర్వా నికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే, సుదీర్ఘ కాలంగా ఇక్కడే కొనసాగుతున్న డిప్యూటీ ఈఓ దోర్బల భాస్కర్ శర్మను సోమవారం వేములవాడకు బదిలీ చేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేయడం ఇప్పుడు ఆలయ వర్గాల్లో హాట్ టాపిక్ మారింది.

**రాజకీయ పలుకుబడికి చెక్...**

కారుణ్య నియామకం ద్వారా విధుల్లోకి చేరిన భాస్కర్ శర్మ, తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని ఏళ్ల తరబడి యాదగిరిగుట్టలోనే పాతుకుపోయారనే విమర్శలు ఉన్నాయి. 18 నెలల క్రితం వేములవాడ ఆలయ నుంచి డిప్యూటీ ఈఓగా బదిలీపై వచ్చిన నవీన్ కుమార్ అనే అధికారికి, భాస్కర్ శర్మ తన పరపతితో అడ్డుతగిలినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

సీనియర్ అధికారి అయిన నవీన్ కుమార్ డిప్యూటీ ఈఓ విధులు అప్పగించకుండా, కేవలం ఏఈఓ స్థాయి బాధ్యతలకే పరిమితం చేసిన వ్యవహారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతోనే బదిలీ వేటు పడినట్లు సమాచారం.

**డిప్యూటేషన్ల మాయాజాలం**

తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం దేవాలయాల పరిపాలనను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తుంటే,కొందరు అధికారులు మాత్రం డిప్యూటేషన్ మంత్రాన్ని జరిపిస్తున్నారు. గతంలో బదిలీ అయినప్పటికీ, వేములవాడ, కొమురవెల్లి వంటి ప్రాంతాల నుంచి తిరిగి యాదగిరిగుట్టకే డిప్యూటేషన్ మీద రావడం గమనార్హం. గతంలో ఎండోమెంట్ డైరెక్టర్, ఈ ఆలయంలో ఇంచార్జి ఈఓగా ఉన్న ఎస్.వెంకట్రావు డిప్యూటేషన్ అధికారులను వెనక్కి పంపుతూ ఉత్తర్వులు ఇచ్చినా, రాజకీయ ఒత్తిళ్లతో కొద్ది రోజుల్లోనే ఆ ఉత్తర్వులను రద్దు చేయాల్సి వచ్చిందంటే ఇక్కడి అధికారుల ప్రభావం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు.

**వివిఐపి సేవలో తరిస్తూ.. తిష్టవేసి !**

ఆలయంలోని కీలక విభాగాల్లో పనిచేస్తున్న కొందరు అధికారులు భక్తుల సేవ కంటే విఐపిల సేవకే ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యమైన పలుకుబడి కలిగిన రాజకీయ నాయకులు,ఉన్నత అధికారుల పుట్టినరోజులు, పెళ్లిరోజుల సమయంలో స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం అందజేస్తూ వారిని ప్రసన్నం చేసుకుంటున్నారు. ఈ రకమైన సాన్నిహిత్యాన్ని అడ్డుపెట్టుకుని ఆలయ పరిపాలనలో తమదే పైచేయిగా వ్యవహరిస్తున్నారు.

**ఆలయ అధికారుల్లో మొదలైన వణుకు**

తాజా బదిలీతో ఆలయంలోని వివిధ విభాగాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న సహాయ కార్యనిర్వహణ అధికారులు, పర్యవేక్షణ అధికారులకు బదిలీ భయం పట్టుకుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రక్షాళనను ఇలాగే కొనసాగిస్తే ఏళ్ల తరబడి ఆలయంలో తిష్ట వేసిన కొందరి అధికారుల సీట్లు కదలడం ఖాయమని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## "అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్" తీసుకురావడం శుభ పరిణామం

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**జయభేరి, దేవరకద్ర :**

"అడ్వకేట్ ప్రొడక్షన్ యాక్ట్" తీసుకురావడం మంచి పరిణామమని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. అసెంబ్లీలో సోమవారం ఆయన మాట్లాడారు. మంత్రి శ్రీధర్ బాబు ప్రవేశ పెట్టిన అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్టును స్వాగతిస్తున్నా మన్నారు. న్యాయవాదుల న్యాయం సాధించడంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, ఇటీవల కాలంలో వారిపై దాడులు, బెదిరింపులు పెరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని "అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్" తీసుకురావడం శుభ పరిణామం అన్నారు. న్యాయవాదుల భద్రతను కాపాడేందుకు ప్రభుత్వం తీసుకు వచ్చిన ఈ చట్టం సమచితమైందని ఎమ్మెల్యే జీఎంఆర్ అన్నారు.

## ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేద్దాం

- దేవరకద్ర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూనేటి అంజిల్ రెడ్డి



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించే దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పర్యటనను విజయవంతం చేద్దామని కాంగ్రెస్ పార్టీ దేవరకద్ర మండలం అధ్యక్షుడు భూనేటి అంజిల్ రెడ్డి కోరారు. దేవరకద్ర నియోజకవర్గంలో ముందుగా ఉదయం 9 గంటలకు భూత్పూర్ మున్సిపాలిటీలోని ఏఎంఆర్ గార్డెన్స్ లో కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే జిఎంఆర్ పంపిణీ చేస్తానన్నారు. అలాగే 10 గంటలకు భూత్పూర్ మున్సిపాలిటీ కేంద్రంలో జరిగే సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. అలాగే మధ్యాహ్నం 1:30 దేవరకద్ర ఎమ్మార్వో కార్యాలయం వద్ద దేవరకద్ర మరియు కౌకుంట్ల మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేస్తారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు దేవరకద్ర మున్సిపాలిటీ జనరల్ బాడీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. కావున ఈ కార్యక్రమాలలో మున్సిపాలిటీ చైర్మన్ లు, వైస్ ఛైర్మెన్ లు, కౌన్సిలర్లు, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచ్ లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని అంజిరెడ్డి కోరారు.

## ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



**జయభేరి, యాదగిరిగుట్ట :**

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీ భరత్‌గౌడ్ సూచించారు. ప్రజాపాలనప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని యాదగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వైద్య శిబిరంలో జనరల్ ఫిజీషియన్,గైనకాలజిస్ట్, దంత,కంటి,శిశు,స్త్రీ, ఎముకలు,ఆర్థోపెడిక్ నిపుణులు వైద్యపరీక్షలు నిర్వహించారు. మొత్తం 207 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణిభరత్ గౌడ్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, వాళ్ల దగ్గరికే వచ్చి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ వైస్ చైర్మన్ బరిగె రమ్యారాంచందర్, మున్సిపల్ కౌన్సిలర్లు బోడ రాధ సురేష్, బూడిద మధు, పెలిమెల్లి లావణ్యశ్రీధర్, ముక్కెర్ల మల్లేష్‌యాదవ్‌తో పాటు వైద్యులు యశోద, నీతు, శ్రీజ, రాశి, నబీలా, శ్వేత, సునాంగలి, పావని, హరీష్, అనిత, సీహెచ్ వెంకటయ్య, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ గ్రంథాలయాలతో ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త వెలుగు

- లాల్ గడి మలక్ పేట్, అలియాబాద్ పాఠశాలల్లో మోడల్ లైబ్రరీలు ప్రారంభం
- పాఠశాలల్లో ఆధునిక గ్రంథాలయాలు – విద్యకు బలమైన పునాది
- పుస్తక పఠనంతో మేధో వికాసం – హనుష్ సూరపనేని



**జయభేరి, శామీర్ పేట్, మర్చి 30 :**

లాల్ గడి మలక్ పేట్ మరియు అలియాబాద్ లోని ప్రభుత్వ పాఠశాలల్లో మోడల్ గ్రంథాలయ ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. హెచ్ బి ల్ ఇంజనీరింగ్ సంస్థ మరియు సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులను ప్రోత్సహించేందుకు గాను పుస్తకాలు మరియు ఫర్నిచర్, రాక్స్ ను అందచేశారు. ఈ సందర్భంగా ఎచ్ బి ల్ ఇంజనీరింగ్ సంస్థ జనరల్ మేనేజర్ హనుష్ సూరపనేని మాట్లాడుతూ గ్రంథాలయాలు మేథో సంపత్తిని పెంపొందించడానికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, పుస్తకాలు చదివే ప్రతిక్షణం మన భవిష్యత్ ను నిర్మించేందుకు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పుస్తక పఠనం అలవాటుగా మారి వారి భవిష్యత్ కు బలమైన పునాది వేయాలని వారు ఆకాంక్షించారు. అనంతరం ఎచ్ బిల్ సంస్థ సహకారంతో తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన కెరీర్ బుక్ లెట్ ను పాఠశాల యాజమాన్యానికి అందచేశారు. అనంతరం పాఠశాల యాజమాన్య సిబ్బంది మాట్లాడుతూ ఎచ్ బి ల్ సంస్థ పాఠశాలకు బహుకరించిన సామాగ్రిని వినియోగిస్తూ విద్యార్థుల భవిష్యత్తును మెరుగ్గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి ఎం శ్రీ హనుష్‌సూరపనేని,ఎచ్ బి ల్ సంస్థ సీనియర్ మేనేజర్ కృష్ణంరాజు, అసోసియేట్ విజయలక్ష్మి, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామ స్వామి దేవాలయంలో చారిత్రక ఫోటో ఆవిష్కరణ

- చరిత్రను గుర్తుచేసుకున్న దేవరయాంజాల్ గ్రామం



**జయభేరి, శామీర్ పేట్, మర్చి 30 :**

మల్కాజ్‌గిరి కార్పొరేషన్ పరిధిలోని శామీర్‌పేట్ డివిజన్ దేవరయాంజాల్ గ్రామంలోని శ్రీ సీతారామ స్వామి దేవాలయంలో చారిత్రక ప్రాధాన్యం కలిగిన కార్యక్రమం ఘనంగా జరిగింది.1983 నవంబర్ 20న బ్రిటన్ మహారాణి రెండవ ఎలిజబెత్ గారు దేవాలయాన్ని సందర్శించిన సందర్భాన్ని స్మరించుకుంటూ, ఆ కాలానికి చెందిన ఫోటోను తిరిగి రూపొందించి దేవాలయానికి సమర్పించారు. ఈ ఫోటోను ఫ్రేమ్ గా రూపొందించగా మోటే నరసింహ కుమారుడు మోటే సురేష్ దేవస్థానానికి అందజేశారు. ఈ దేవాలయ చరిత్రలో మహారాణి సందర్శన ఒక విశేష ఘట్టంగా నిలిచిన నేపథ్యంలో ఈ ఫోటో సమర్పణ భవిష్యత్ తరాలకు ఒక చారిత్రక స్మృతిగా నిలుస్తోందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టిఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్లు పేండం లక్ష్మినారాయణ, దాసరి గోపాల్ రెడ్డి, పన్నాల సుధాకర్ రెడ్డి, మాజీ ధర్మకర్త వలందాసు మురళి గౌడ్, మున్సిపల్ బీజేపీ మాజీ అధ్యక్షుడు పట్నం నర్సింహా రెడ్డి, అర్చకులు కందాళ సీతారామచార్యులు, భక్తులు పిన్నింటి ధర్మారెడ్డి, పన్నాల వీరారెడ్డి, కట్ట శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సీతారామస్వామి బ్రహ్మోత్సవాలు

- సూర్యప్రభ వాహనంపై ఊరేగిన స్వామివారు

**జయభేరి, శామీర్ పేట్, మర్చి 30 :**

మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని శామీర్‌పేట్ డివిజన్ దేవరయాంజాల్ గ్రామంలో వెలసిన శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం సూర్యప్రభ సేవ అట్టహాసంగా జరిగింది. దేవస్థానం ఈవో వీరేశం పర్యవేక్షణలో ఆలయ అర్చకులు కందాళ సీతారామచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారిని సూర్యప్రభ వాహనంపై అలంకరించి గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు.ఈ సందర్భంగా భక్తులు హారతులు పట్టి, భజనలు చేస్తూ ముందుకు సాగారు. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ఈవో వీరేశం తెలిపారు. అందరి సహకారంతో ఈ ఉత్సవాలు విజయవంతమయ్యాయని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్లు పేండం లక్ష్మినారాయణ, దాసరి గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోల్డ్ శ్రీనివాస్, బీజేపీ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు పట్నం నర్సింహారెడ్డి, మాజీ ధర్మకర్త ఎల్లెంకి భారతి, భక్తులు పేండం యాదగిరి, సింగం రామరావు, బర్ల అనంత రెడ్డి, బెంబడి జంగారెడ్డి, నాళ్ళచెరువు శంకరప్ప, మిర్యాలకర్ సాయి కుమార్, బర్ల నరేందర్ రెడ్డి, కౌడే కుమార్, బంగరిగళ్ళ నవీన్, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతుల సమస్యలు పరిష్కరిస్తాం



**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 30:**

రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని తక్షణమే పరిష్కరిస్తామని యాదగిరిగుట్ట పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జి శ్రీనివాస్, సీఈఓ ఆంజనేయులు తెలిపారు. సోమవారం యాదగిరిగుట్ట పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో మహాజన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీఏసీఎస్ పరిధిలోనిరైతులు, మాసాయిపేట, మైలారిగూడెం, బహుపేట, కంఠంగూడెం, ధర్మారెడ్డి గూడెం గ్రామ సర్పంచ్‌లు కళ్లెం జహంగీర్, కొండల్ రెడ్డి, మహేందర్, కృష్ణయ్య, రాజయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సకాలంలో యూరియా, పంటలకు సంబంధించిన మందులను అందిస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడం రైతులకు కొంత ఇబ్బంది కలుగుతున్నా ఈ విషయంలో రైతులకు సహకరిస్తున్నామని అన్నారు. రైతులు తీసుకున్న రుణాలకు సకాలంలో వాయిదాలు చెల్లించాలని కోరారు.

## యాదగిరీశుడి హుండీ ఆదాయం రూ.1.52 కోట్లు



**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 30 :**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి హుండీ ఆదాయం రూ.1,52,01,420 వచ్చినట్లు యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ తెలిపారు. సోమవారం కొండ కింద గత వ్రత మండపంలో స్వామి వారి 20 రోజుల హుండీ ఆదాయం లెక్కింపు జరిగింది. ఆదాయంతో పాటు 54 గ్రాముల బంగారం, 2 కిలోల 700 గ్రాముల వెండిని హుండీలో భక్తులు సమర్పించుకున్నట్లు తెలిపారు. దాంతో పాటు విదేశీ కరెన్సీ అమెరికా 248 డాలర్లు, ఇంగ్లాండ్ 15 పౌండ్స్, కెనడా 10 డాలర్స్,దిరామ్స్ 60, నేపాల్ 10,ఆస్ట్రేలియా 55, రియాల్ 201/2,వియత్నాం 2,000, మలేషియా 1, థాయ్‌లాండ్ 220,సింగపూర్ 27, టాంజానియా 20,000, సౌదీ అరేబియన్ 50, ఖతార్ 1, న్యూజిలాండ్ 20, యూరో 10ను హుండీలో సమర్పించుకున్నట్లు తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ కలిసిన ముదిరాజ్ సంఘం నాయకులు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ను సోమవారం నారాయణపేట జిల్లా ధన్వాడ మండలానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ను వారు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అలియాబాద్ మున్సిపల్ బడ్జెట్ ఏకగ్రీవ ఆమోదం

- అభివృద్ధికి ప్రాధాన్యం – అభివృద్ధి పనులకు సహకరించాలని - చైర్మన్ కంఠం శిరీష కృష్ణ రెడ్డి

**జయభేరి, శామీర్ పేట్, మార్చి 30 :**




అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో 2026 27 సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ వార్షిక బడ్జెట్ ను ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానం చేశారు.

ఈ సందర్భంగా బడ్జెట్ అంచనా వివరాలను మున్సిపల్ చైర్మన్ తెలియచేశారు. ఇందులో ఇంటి పన్నులు 4 కోట్ల 45 లక్షలు, షాపింగ్ కాంప్లెక్స్ అద్దె గాను 9 లక్షలు, మ్యుటేషన్ కు 9 లక్షలు, ట్రేడ్ లైసెన్స్ ఫీజు 12 లక్షలు, భవన నిర్మాణ అనుమతిపై ఆదాయం 2 కోట్ల 25 లక్షలు, లేఔట్ / సబ్ డివిజన్ ఫీజు కై కోటి 75 లక్షలు, ఈ ఎం డి ల ద్వారా ఆదాయం 1.50 లక్షలు, మొత్తం మున్సిపల్ సాధారణ ఆదాయం 10 కోట్ల 20 లక్షలుగా అంచనా వేసినట్లు తెలిపారు.




అదేవిదంగా వ్యయం అంచనా వివరాలను ఆయన వెల్లడించారు. మొత్తం సిబ్బంది వేతనాలకు 2 కోట్ల 75 లక్షలు, పారిశుధ్యానికి 94 లక్షలు, విద్యుత్ ఛార్జీలు 26 లక్షలు, గ్రీన్ బడ్జెట్ కు కోటి 18 లక్షలు, మెయింటనేన్స్ కింద కోటి 59 లక్షలు, ఇతర అభివృద్ధి పనులకై 3 కోట్ల 26 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు. మొత్తం వ్యయం 9 కోట్ల 62 లక్షలు అయితే మిగులు నిల్వ 58 లక్షల అంచనా వేసినట్లు ఆయన వెల్లడించారు. మున్సిపాలిటీని దశలవారీగా అభివృద్ధి చేస్తున్నట్లు, అభివృద్ధి పనులకు అందరు సహకరించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ కన్ రెడ్డి మాలతి, కౌన్సిలర్లు, ఎ ఈ సన షాహిన్, జూనియర్ అకౌంటెంట్ సి ఎచ్ రమేష్, శానిటరీ ఇన్స్ స్పెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ బడ్జెట్ రూ.25.73 కోట్లు

- జనరల్ ఫండ్ ఆదాయం రూ. 6.83 కోట్లు, ఖర్చు రూ.6.60 కోట్లు
- ప్రభుత్వ గ్రాంట్ల ఆదాయం రూ.18.90 కోట్లు

**జయభేరి, యాదగిరిగుట్ట :**




యాదగిరిగుట్ట మున్సిపాలిటీ వార్షిక బడ్జెట్ రూ.25.73 కోట్లుగా ప్రకటించారు. మున్సిపల్ జనరల్ ఫండ్ ఆదాయం రూ.6.83 కోట్లు కాగా అందులో 4.42 కోట్లు, ఇతర ఖర్చుల పేరుతో 2.18 కోట్లు కేటాయించగా అందులో 1.70కోట్లు జీతాలను కేటాయించారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీ 202627 సంవత్సరం ఆర్థిక బడ్జెట్ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సమక్షంలో ఏర్పాటు చేసిన బడ్జెట్‌ను సోమవారం యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీ భరత్‌గౌడ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఏకగ్రీవంగా బడ్జెట్ తీర్మానం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ లింగ స్వామి ప్రకటించారు. సంవత్సర జనరల్ ఫండ్ రూ.6.83 కోట్లుగా నిర్ధారించగా, ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా ఆదాయం రూ.18.90 కోట్లుగా, మొత్తంగా 25.73 కోట్లుగా ఆర్థిక బడ్జెట్ ప్రకటించారు. జనరల్ ఫండ్ బడ్జెట్‌లో భాగంగా సీసీ చార్జెస్ 1.20 కోట్లు, పారిశుధ్య నిర్వహణకు 1.16కోట్లు,గ్రీన్ బడ్జెట్‌కు 0.57 కోట్లు, వాటర్ సప్లై నిర్వహణకు 0.46 కోట్లు, పరిపాలన ఖర్చుకు 0.52 కోట్లు,ప్రజా సౌకర్యాలకు 0.23 కోట్లు, వార్డుల వారీగా అభివృద్ధి ఖర్చు 0.28 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బరిగె రమ్య, మున్సిపల్ కౌన్సిలర్స్ బోడ రాధ, బూడిద మధు, కాటబత్తిని స్వప్న, బిట్టు సరోజ, కర్రె మాధవి, పెలిమెల్లి లావణ్య, పేరబోయిన సత్యనారాయణ, సాదునేని ధనలక్ష్మి, ముక్కెర్ల మల్లేష్, బబ్బూరి శ్రీధర్, కార్యాలయ మేనేజర్ యు.శారద, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.సురేందర్, సీనియర్ అసిస్టెంట్ యల్.రవీందర్, జూనియర్ అకౌంటెంట్ కె.రజినితో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ లక్ష్యం

- పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్న ఇందిరమ్మ ఇల్లు
- పేదల కల నెరవేర్చాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం - చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి

**జయభేరి, శామీర్ పేట్, మార్చి 30 :**



పేదల సొంతింటి కల నెరవేర్చాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా అలియాబాద్ మున్సిపాలిటీ పరిదిలోని తుర్కపల్లి గ్రామంలో రుద్రబోయిన లక్ష్మికృష్ణ , రుద్రబోయిన లక్ష్మి నర్సయ్య గార్లు నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కంఠం శిరీష కృష్ణ రెడ్డితో పాటు మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి , అలియాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకి రమేష్ లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టిందని వెల్లడించారు. ఇళ్లు లేని వారి ఇళ్లు నిర్మించి వారి చిరకాల కోరిక నెరవేరుస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సామల జశ్వంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గురకల సాయి కృష్ణ, మున్సిపల్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఊరడి వెంకటేష్, రాజబోయిన శ్రీనివాస్ యాదవ్ ,ఇందిరమ్మ కమిటీ సభ్యులు విరన్నగారి భూపాల్, నాయకులు యాదగిరి , రమేష్ నాయక్ , కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చట్లపల్లి నర్సింగ రావు , యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, ఏళ్ల సాయి, గుర్కాల శ్రవణ్ కుమార్, నీరుడి బాలేశ్, గుర్కా రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆ క్షణం చనిపోవాలనుకున్న

- డ్రగ్స్ కేసులో తీవ్రంగా మానసికంగా క్రుంగిపోయాను.. నటి హేమ




ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ నటి హేమతో "మీట్ ది ప్రెస్" తెలుగు సినిమా ఇండస్ట్రీలో నటి హేమ కు ప్రత్యేకమైన పరిచయం అవసరం లేదు. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్‌గా ఎన్నో విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరించిన ఆమె, తన సహజమైన నటనతో ప్రత్యేక గుర్తింపు పొందారు. అదే సమయంలో నేరుగా, బహిరంగంగా తన అభిప్రాయాలను చెప్పే స్వభావం వల్ల కూడా తరచూ వార్తల్లో నిలుస్తూ ఉంటారు. టాలీవుడ్‌లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్‌గా దశాబ్దాల పాటు తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి హేమ ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ నటి హేమతో నిర్వహించిన "మీట్ ది ప్రెస్" కార్యక్రమం హైదరాబాద్‌లోని తెలుగు ఫిలిం ఛాంబర్‌లో సోమవారంనాడు జరిగింది. ఈ సందర్భంగా ఆమె ఇటీవల తనపై నమోదైన డ్రగ్స్ కేసు, దాని వల్ల తన కుటుంబం ఎదుర్కొన్న ఇబ్బందులు, మీడియా పాత్ర వంటి అంశాలపై భావోద్వేగంగా స్పందించారు.

తెలుగు ఫిలిం ఛాంబర్ లో ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో నటి హేమ మాట్లాడుతూ.... డ్రగ్స్ కేసులో తనపై వచ్చిన ఆరోపణలు తనను తీవ్రంగా మానసికంగా కలచివేశాయని చెప్పారు. "ఆ సమయంలో నేను చచ్చిపోవాలనిపించింది. అంతగా మానసికంగా కుంగిపోయాను" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తాను ఎలాంటి తప్పు చేయలేదని, అందుకే చివరకు నిర్దోషిగా బయటకు వచ్చానని స్పష్టం చేశారు. డ్రగ్స్ వ్యవహారంలో కొందరు మీడియా సంస్థలు తనపై నిరాధార ఆరోపణలు చేస్తూ బురదజల్లాయని ఆమె ఆరోపించారు. ఆ వార్తల కారణంగా తన వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబ సభ్యులు కూడా తీవ్రంగా బాధపడ్డారని చెప్పారు. "నా కుటుంబం చాలా సఫర్ అయింది. మాకు ఇది చాలా కఠినమైన కాలం" అని ఆమె పేర్కొన్నారు. అయితే మొత్తం మీడియాను ఒకే తాటిపై వేయలేమని, నిజాయితీగా వ్యవహరించే మీడియా సంస్థలు తనకు మద్దతుగా నిలుస్తాయని తాను నమ్ముతున్నానని హేమ తెలిపారు. భవిష్యత్తులో కూడా మీడియా తనకు న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



## మున్సిపల్ కమిషనర్ పై ఫిర్యాదు

**జయభేరి, మేడ్చల్ :**

ఎల్లంపేట్ మున్సిపల్ కమిషనర్ విధుల పట్ల అలసత్వం వహిస్తూ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అక్రమాలను ప్రోత్సహిస్తున్నడాని ఆరోపిస్తూ స్థానికుడు వడ్ల నాగచారి సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేశారు. ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించే విధంగా మున్సిపల్ కమిషనర్, మేనేజర్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ నివందనలకు విరుద్ధంగా నిర్మించిన నిర్మాణాలకు అడ్డదారిలో ఇంటి నెంబర్లు కేటాయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న అధికారులపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ హయాంలో పేదల సొంతింటి కల నెరవేరుతుంది



**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ సర్కిల్ మేడ్చల్ డివిజన్ పరిధిలోని కౌడే పద్మ శ్రీనివాస్ కురుమ నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో మేడ్చల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందని, పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని, ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు, పట్టణాలు లేవని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాము. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుర్గం శివ శంకర్ ముదిరాజ్, మేడ్చల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్నగారి సంతోష్ గౌడ్, పానుగంటి మహేష్ కుమార్, మేడ్చల్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్ వంజరి, మేడ్చల్ మున్సిపాలిటీ ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు గుండ శ్రీధర్ కురుమ, మేడ్చల్ మున్సిపాలిటీ ఎస్ సి సెల్ అధ్యక్షులు దండు శ్రీకాంత్ (చింటు), ఘనపురం మల్లేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరతను నిరసిస్తూ ఆర్డీఓకు చిరు వ్యాపారులు వినతి పత్రం




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలో చిరు వ్యాపారుల యూనియన్ అధ్యాక్షుడు లచ్చిరాం ఆధ్వర్యంలో పట్టణం లో వాణిజ్య గ్యాస్ కొరతను నిరసిస్తూ. దేవరకొండలోపట్టణం లో హోటళ్ల తోపుడు బండ్లు, టీ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. నిత్యం జరుగుతున్న దాడులు, అధిక పన్నుల భారం నుండి తగ్గించాలని వారు కోరారు. చిరు వ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలని, గ్యాస్ కొరతను వెంటనే తీర్చాలని వారు విజ్ఞప్తి చేస్తూ ఆర్డీవో కార్యాలయంలో నిరసన వ్యక్తం చేస్తూ ఆర్డిఓకి వినతి పత్రం అందజేసినారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు లచ్చిరాం తోపాటు ఉపాధ్యక్షులు వంశీ కార్యదర్శి కుమార్ కోశాధికారి నర్సింహ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఫెడరేషన్ of SBI OBC ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎలక్షన్స్



**జయభేరి, దేవరకొండ :**

నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఎస్బిఐ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ 28.03.2026 రోజున ఢిల్లీలో జరిగిన జాతీయ ఫెడరేషన్ of SBI OBC ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎలక్షన్స్ నిర్వహించడం జరిగినది. హైదరాబాద్ సర్కిల్ కి చెందిన OBC రాష్ట్ర అధ్యక్షుడు NVT కి నేషనల్ ఫెడరేషన్ OF SBI OBC ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నుకోవడం జరిగినది. అనంతరం హైదరాబాద్ సర్కిల్ ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శిలు కలసి ఘనంగా సత్కరించినారు.




## నేడు ఉచిత ఫెర్టిలిటీ క్యాంపు

- లక్ష్మీ విజయ స్పెషాలిటీ హాస్పిటల్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ లో నేడు లక్ష్మి విజయ స్పెషాలిటీ హాస్పిట ల్ లో ఉచిత ఫెర్టిలిటీ క్యాంపు నిర్వహించబడును. OVA ఫెర్టిలిటీ వారిచే నిర్వహించబడును. క్యాంపు నందు రిజిస్ట్రేషన్ చేయించుకున్న దంపతులకు రాయితీలు ఇవ్వబడును ఉచిత కన్సోలేషన్ ఇవ్వబడును అని ఒక ప్రకటనలో డాక్టర్ శంకర్ నాయక్ తెలియజేసినారు.

## అరెస్టులతో ప్రజా ఉద్యమాలు ఆపలేరు



**జయభేరి, దేవరకొండ :**

అరెస్టులతో ప్రజా ఉద్యమాలు ఆపలేరు అని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. సోమవారం నిరుద్యోగుల అసెంబ్లీ ముట్టడి సందర్భంగా ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులను ఎన్నికల ముందు నమ్మించి, తీరా గద్దెనెక్కాక నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన తెలిపారు.వయోపరిమితి 46 నుంచి 34కి తగ్గించి, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆటలు ఆడుతున్న రేవంత్ సర్కార్ అని ఆయన అన్నారు.తొలి ఏడాది 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ అని ఆయన అడిగారు.బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ లేదు, రూ. 4,000 నిరుద్యోగ భృతి ఏమైంది అని ఆయన అన్నారు.బడ్జెట్‌లో 'జాబ్ క్యాలెండర్' ఊసే లేదు అని ఆయన తెలిపారు. బడ్జెట్ లో 2 లక్షల ఉద్యోగాల ప్రస్తావన లేకపోవడం విచారకరం అని ఆయన అన్నారు.ప్రజలకు ఇచ్చిన 6గ్యారంటీలు 420 హామీ అమలు చేయాలి అని డిమాండ్ చేశారు.

## వృద్ధురాలు అదృశ్యం



**జయభేరి, హయత్నగర్ :**

వర్ధయ్య నగర్, కుంట్లూరు రోడ్డు, హయత్నగర్ కి చెందిన చిరబోయిన సత్తమ్మ(68), భర్త లేట్ రాములు, చాలా సంవత్సరాల నుండి తన కుమారుడైన చిరబోయిన శివధన కుమార్ తో కలిసి నివాసం ఉంటున్నారు. సత్యమ్మకి ఆరోగ్యం సరిగా ఉండటం లేదు. 23 మర్చి, సోమవారం ఉదయం 10:30కి చిరబోయిన శివధన కుమార్ బయటకు వెళ్లి తిరిగి మధ్యాహ్నం 13:00 గంటలకి శివధన కుమార్ ఇంటికి తిరిగి వచ్చి చూసే వరకు తన అమ్మ సత్తమ్మ కనిపించలేదు. తన అమ్మా గురించి చుట్టుపక్కల ప్రాంతాలలో, తన బంధువుల దగ్గర వెతికిన ఎటువంటి ఆచూకీ లభించలేదు. ఇన్ని రోజులు తన అమ్మా తిరిగి వస్తుందేమో అని ఎదురుచూసి తిరిగి రాకపోయే వరకు శివధన కుమార్ తన అమ్మా చేరబోయిన సత్తమ్మ గారిని వెతికి పెట్టవలసిందిగా ఫిర్యాదు చచేయనైనది. శుభదినకుమార్ కి వివాహమైనది ప్రస్తుతం ఒంటరిగా తన తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు.

# రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సహకారంతో సైకిల్ లను పంపిణీ

- రోటరీ క్లబ్ వారి చేస్తున్న సేవలు అభినందనీయం. ఎంఈఓ మంజుషారాణి



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 30 :**

తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 15 మంది బాలికలకు రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సహకారంతో సైకిల్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాసాలమర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న శ్రీనివాసపురం, కొండాపురం, రామ్ శెట్టిపల్లి, తిరుమలపురం గ్రామాల నుండి సుమారు మూడు నుంచి ఐదు కిలోమీటర్లు రోజు విద్యార్థులు నడుచుకుంటా పాఠశాలకు వచ్చి చదువుకుంటున్నారని వారి యొక్క ఇబ్బందులను గ్రహించి పాఠశాలకు 15 సైకిళ్లను అందజేయడం హర్షనీయమని అన్నారు. రాబోవు కాలంలో పాఠశాలకు మరిన్ని సేవా కార్యక్రమాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాల కోటిరెడ్డి హాజరై మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా 22 దేశాల్లో సేవలను అందజేస్తున్నట్లు తెలిపారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన సైకిళ్లను విద్యార్థినిలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పాఠశాలలో మంచిగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని అన్నారు. రాబోవు కాలంలో మంచిగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి రోటరీ క్లబ్ వాళ్లను ఆదర్శంగా తీసుకొని ఆ విధంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా తయారు కావాలని అన్నారు. జిల్లా సీఎంవో పెసరు లింగారెడ్డి మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ నుండి పాఠశాల అభివృద్ధికి ఎలాంటి సహాయ సహకారాలైన అందజేస్తామని అన్నారు. రోటరీ క్లబ్ భువనగిరి అధ్యక్షుడు పలుగుల ఆగేశ్వరరావు మాట్లాడుతూ తాను చిన్నతనంలో చదువుకున్న పాఠశాలకు రోటరీ క్లబ్ ద్వారా సైకిళ్లను అందించడం ఆనందంగా ఉందని అన్నారు. తాను చదువుకున్న రోజుల్లో పాఠశాలకు రావడానికి అనేక ఇబ్బందులు పడ్డామని, ఆ ఇబ్బందులు ఇప్పటి విద్యార్థులు పడకూడదనే ఉద్దేశంతో రోటరీ క్లబ్ తరఫున సహాయాన్ని అందజేసినట్టు తెలిపారు. ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకొని రాబోవు కాలంలో మంచిగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు పి బాలమణి, రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు కళ్యాణ్ పంగులూరి, గ్రామ సర్పంచ్ దొమ్మాట అనురాధ బాబు, ఝూన్సీ ప్రేమానంద జూబ్లీహిల్స్ సెక్రెటరీ లక్ష్మి వీసిరెడ్డి, భువనగిరి సెక్రటరీ తవిటి వెంకటనారాయణ, తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ గడ్డం జ్ఞాన ప్రకాశ్ రెడ్డి, కాచారం నాగరాజు, ఉప సర్పంచ్ బాల నరసయ్య, వార్డు సభ్యులు, ఎన్నిక అధ్యక్షుడు కూచిపట్ల సత్యనారాయణ రెడ్డి, ఫాస్ట్ అధ్యక్షుడు కరిపే నర్సింగరావు, వేమూరి అశోక్ కుమార్ గౌడ్, బాలేశ్వర్, భాస్కర రావు, పాండరీనాథ్, దేవేంద్ర చారి, గ్రామస్తులు సింగం వెంకటేశం, సూరంపల్లి మురళి, టి.రవి, పలుగుల మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఫార్మా సిటీలో భారీగా గంజాయి దగ్ధం

**జయభేరి, పరవాడ:**

మాదకద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పోలీస్ విభాగాలు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో మరియు వింగ్ సంయుక్తంగా భారీ స్థాయిలో గంజాయి నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఐదు వేర్వేరు కేసుల్లో ఎన్సిబి స్వాధీనం చేసుకున్న సుమారు 1108 కిలోల గంజాయిని సోమవారం నాడు శాస్త్రీయ పద్ధతిలో దగ్ధం చేశారు.పరవాడ మండలం, తానం గ్రామంలోని రామ్ కీ ఫార్మా కంపెనీలో ఉన్న అత్యాధునిక ఇన్సినరేషన్ ప్లాంట్ లో ఈ కార్యక్రమం జరిగింది.ఎన్సిబి జోనల్ డైరెక్టర్ పంకజ్ కుమార్ ద్వివేది, సూపరింటెండెంట్ శ్రీ రాజన్ కుమార్ మరియు ఈగల్ ఎస్పీ నగేష్ బాబు ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ డిస్ట్రక్షన్ ప్రక్రియ పూర్తయ్యింది. బహిరంగంగా కాల్చకుండా, కాలుష్య నియంత్రణ ప్రమాణాలను పాటిస్తూ ఇన్సినరేషన్ మెషీన్ ద్వారా గంజాయిని నిర్వీర్యం చేశారు.ఈ కార్యక్రమంలో ఉన్నత అధికారులతో పాటు ఎన్సిబి విభాగం ఇన్స్పెక్టర్ కె.కిరణ్ బాబు మరియు ఈగల్ విభాగం ఇన్స్పెక్టర్లు డాక్టర్ కళ్యాణి, ధనుంజయ నాయుడు మరియు అనకాపల్లి ఈగల్ సెల్ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, డ్రగ్స్ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని, యువతను వ్యసనాల బారి నుండి కాపాడేందుకు ఇటువంటి తనిఖీలు, నిర్మూలన చర్యలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. పట్టుబడిన మత్తు పదార్థాలను ఎప్పటికప్పుడు కోర్టు అనుమతితో ఇలాగే ధ్వంసం చేస్తామని జిల్లా పోలీస్ శాఖ అధికారులు పేర్కొన్నారు.

# మానవత సేవాలో జాగృతి మహిళా సమితి పవర్ గ్రిడ్ సభ్యులు




**జయభేరి, పరవాడ:**

జాగృతి మహిళా సమితి, పవర్ గ్రిడ్ వైజాగ్ కుటుంబ సభ్యులు సోమవారం అచ్చుతాపురం మండలం, కొండకర్ల గ్రామంలో ఉన్న ఇచ్చా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న మానసిక వికలాంగుల ఆశ్రమాన్ని సందర్శించారు. అక్కడ నివసిస్తున్న వారి బాగోగులను తెలుసుకొని, వారికి ₹16,031/ విలువైన నిత్యావసర సరుకులు, మందులు, బట్టలు మరియు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆశ్రమ ఫౌండర్ టి. మధు మరియు నిర్వాహకురాలు అరుణ జాగృతి మహిళా సమితి సభ్యుల సేవాభావాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి అందాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జాగృతి మహిళా సమితి అధ్యక్షురాలు పద్మజ, ఉపాధ్యక్షురాలు టి. స్వాతి, కోశాధికారి పి.వి. సత్యవతి మరియు ఇతర సభ్యులు పిల్లలు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ అధ్యక్షులకు సన్మానం

- సన్మానం చేసిన కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్



**జయభేరి, గజ్వేల్, మార్చ్ 30 :**

గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన కిరణ్ సాగర్ ను సోమవారం 20వ వార్డులో వార్డ్ కౌన్సిలర్ అత్తిలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు అనంతరం వారు మాట్లాడుతూ గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఘన విజయం సాధించిన కిరణ్ సాగర్ సార్ కు అభినందనలు శుభాకాంక్షలు, న్యాయ వ్యవస్థలో క్రియాశీల పాత్ర పోషిస్తూ సామాన్యులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తూ అందరి అభిమానం పొందిన కిరణ్ సాగర్ గారు, గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికవ్వడం సంతోషంగా ఉంది, తన పదవీకాలంలో న్యాయమూర్తుల సమస్యల పరిష్కారానికి, బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తారని, ఆశిస్తూ, రాబోయే కాలంలో మరిన్ని ఉన్నత పదవులు స్వీకరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం, లాయర్ గా విధులు నిర్వహిస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందు వరుసలో ఉంటూ, పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న కిరణ్ సాగర్ సార్ కు మరొక్కసారి అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో 20 వ వార్డ్ పెద్దలు,యువకులు,వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం




**జయభేరి, షాద్ నగర్, మార్చి 30 :**

న్యాయవాదుల సంక్షేమాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యాయవాదుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ అసెంబ్లీలో న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ఆమోదించడం పట్ల షాద్ నగర్ పట్టణ న్యాయవాద బార్ అసోసియేషన్ లో నూతన అధ్యక్షుడు బీరంగూడ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పూల వర్షం కురిపించి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యక్షురాలు సబియా సుల్తానా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసమూర్తి, కోశాధికారి రహీముద్దీన్, లైబ్రరీ సెక్రెటరీ జయమ్మ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లైన రూప్ సింగ్, పబ్బే శ్రీశైలం, గూడూరు గణేష్, నరేష్ కుమార్, సంతోష్ నాయక్, సాత్విక, సునీత లతో పాటు పలువురు సీనియర్ మరియ జూనియర్ న్యాయవాదులు, మహిళ న్యాయ వాదులు కూడా పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులతోపాటు న్యాయవాదులు కనకగిరి మోహన్ రావు, కెవిడి చారి, డి నరసిమ్ములు, శ్రీనివాస్ యాదవ్,శ్రీధర్ గౌడ్, చీపిరి చంద్రశేఖర్, గుండుబావి శ్రీనివాస్ రెడ్డి, సయ్యద్ ఖలీల్, కే శంకరయ్య, సుధాకర్ రెడ్డి, విజయ్ కుమార్ గౌడ్, విజయ భాస్కర్, ప్రశాంత్, మాధవ రెడ్డి బేరి శ్రీనివాసులు, మహిళ న్యాయవాదులు షహనాజ్, రిషితా రెడ్డి పాల్గొన్నారు.



# దొడ్డి కొమురయ్య ఉత్సవ కమిటీ సభ్యులుగా మరాటి మల్లేష్ కురుమ

**జయభేరి, మేడిపల్లి, మార్చి 30:**

తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా మరింత ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా కమిటీని ప్రకటించింది. ఈ కమిటీలో మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్‌కు దేవేందర్నగర్ కాలనీకి చెందిన మరాటి మల్లేష్ కురుమను సభ్యునిగా నియమించింది. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో దొడ్డి కొమురయ్య కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆయన త్యాగస్ఫూర్తిని యువతకు పరిచయం చేయడం, పోరాట చరిత్రను ప్రజల్లో విస్తృతంగా చాటిచెప్పడం లక్ష్యంగా ఈ కమిటీ పనిచేయనుందని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జయంతి, వర్ధంతి కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. మరాటి మల్లేష్ కురుమను కమిటీ సభ్యునిగా ఎంపిక చేయడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, కురుమ సంఘం నాయకులు, సామాజిక వర్గాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు దగ్గరగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిటీలో అవకాశం కల్పించిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యలకు మరాటి మల్లేష్ కురుమ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కమిటీ లక్ష్యాల సాధనలో కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.

# రోడ్డు ప్రమాదంలో యాచకురాలు మృతి



**జయభేరి, మేడిపల్లి :**

మేడిపల్లి పిఎస్ పరిధిలోగల చెంగిచెర్ల క్రాస్ రోడ్ సమీపంలోని తులిప్స్ హోటల్ దగ్గర 29 మార్చి, ఉదయం అందాజా 56 గంటల ప్రాంతంలో ఒక గుర్తు తెలియని వాహనం రోడ్డు దాటుతున్న యాచకురాలిని టక్కర్ ఇచి వెళ్లినది దాంతో ఆ యాచకురాలు అక్కడికక్కడే మృతి చెందినది. ఇది గమనించిన కొంతమంది వ్యక్తులు పోలీసులకు ఫిర్యాదు చేయగా మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్ కు తరలించడం జరిగినది. కేసు నమోదు చేసుకొని విచారణ ప్రారంభించడం జరిగినది.

# కలసిపాడు మండలంకు నూతన ఎమ్మార్వో

**జయభేరి, పోరుమామిళ్ల :**

కడప జిల్లా లోని కలసపాడు మండలానికి ఎమ్మార్వోను కలెక్టర్ గారు నియమించడం అయినది ఈరోజు నూతన ఎమ్మార్వో గా రవీంద్రారెడ్డి బాధ్యతలు చేపట్టినారు. నూతన ఎమ్మార్వో గారు ప్రభుత్వానికి ప్రజలకు అనుసంధానముగా పనిచేసే పేదలకు మంచిగా సేవ చేస్తారని మండల ప్రజలు మరియు నాయకులు ఆశిస్తున్నారు.

# ప్రతీ ఒక్కరికి కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి

- సిఐ సత్యనారాయణ
- కాకతీయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్
- నిరుద్యోగ యువతకు కంప్యూటర్ శిక్షణ సర్టిఫికెట్ల పంపిణీ
- ముఖ్యఅతిథిగా మేడ్చల్ సిఐ సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ మణికంఠ గౌడ్



**జయభేరి, మేడ్చల్ :**

కంప్యూటర్ పరిజ్ఞానం మనిషి జీవితంలో తప్పనిసరి అవసరంగా మారిపోయిందని, దానిపై ప్రతీ ఒక్కరికి అవగాహన, పరిజ్ఞానం ఉండాలని మేడ్చల్ సిఐ సత్యనారాయణ తెలిపారు. సోమవారం కాకతీయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ సర్టిఫికెట్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ సిఐ సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ మణికంఠ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాకతీయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా అందించిన స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సర్టిఫికేట్లను అందజేశారు. అనంతరం ముఖ్యఅతిథి సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతిఒక్కరికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల యువతి యువకులకు కాకతీయ ఫౌండేషన్ ఉచితంగా ఉచితంగా శిక్షణలు అందిస్తూ వారికి ఉపాధి అవకాశాలను అందించడం అభినందనీయమన్నారు. ఇలాంటి అవకాశాలను యువకులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో రాణించాలని సూచించారు.

**డిగ్రీల తో యువత ఆగిపోవద్దు:- నిర్వాహకులు**

యువత కేవలం డిగ్రీలతో ఆగిపోకుండా ఉద్యోగ అవకాశాలకు అవసరమైన స్కిల్స్ పెంపొందించుకోవాలని కాకతీయ ఫౌండేషన్ నిర్వాహకుడు లక్ష్మణ్ తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన యువతకు సాంకేతిక నైపుణ్యాలను అందించి వారిని స్వయం ఉపాధి దిశగా నడిపించడమే ఈ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యం అన్నారు. భవిష్యత్తులో మరిన్ని అధునాతన కోర్సులను ప్రవేశపెట్టి ఎక్కువ మంది యువతకు ఉపాధి కల్పించడానికి కాకతీయ ఫౌండేషన్ కృషి చేస్తుందని నిర్వాహకుడు లక్ష్మణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిడియం మేనేజర్ మహేష్, సీఓఓ చెన్నయ్య, సీఎఫ్ఓ రాము, మేనేజర్ మల్లేష్, ఆర్గనేజర్ విశాల్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా మూడవ వార్షికోత్సవ వేడుకలు

**జయభేరి, దేవరకొండ :**




దేవరకొండ మండలం మైనంపల్లి యం.యన్.స్కూల్ మూడవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించిన యం.యన్.స్కూల్ యాజమాన్యం విద్యార్థుల ఉత్సాహం, ఆనందంతో అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించేలా అందంగా అలంకరించబడింది. చిన్నారుల నవ్వులు, వారి ప్రతిభా ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక కాంతిని తెచ్చాయి. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా అద్భుతమైన నృత్య ప్రదర్శనలు చేసి ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశారు. ప్రతి ప్రదర్శనలో వారి కృషి, పట్టుదల స్పష్టంగా కనిపించింది. చిన్నారులు ధరించిన రంగురంగుల వేషధారణలు, వారి సమన్వయం, స్టేజ్ పై చూపిన ఆత్మవిశ్వాసం అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ విజయవంతమైన కార్యక్రమం వెనుక పాఠశాల యజమాన్యం, నిర్వహణ బృందం చేసిన కృషి ఎంతో ప్రశంసనీయం. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా సమాన ప్రాధాన్యతనిస్తూ, వారి ప్రతిభను వెలికితీసేందుకు యాజమాన్యం నిరంతరం కృషి చేస్తోంది. పాఠశాల అభివృద్ధి, శ్రేయస్సు కోసం ఆధునిక సౌకర్యాలు, నాణ్యమైన విద్యను అందిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును వెలుగొందించే దిశగా అడుగులు వేస్తోంది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ నరేష్ మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభను చూసి ఆనందం వ్యక్తం చేశారు. వారు చదువులోనే కాకుండా అన్ని రంగాలలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గురువుల కృషి, తల్లిదండ్రుల సహకారం, యాజమాన్యం సంకల్పంతో పాఠశాల మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తంగా, యం.యన్.స్కూల్ మూడవ వార్షికోత్సవ వేడుకలు ఆనందం, ఉత్సాహం, సాంస్కృతిక విలువల సమ్మేళనంగా విజయవంతంగా నిలిచాయి.

# మహిళల సంక్షేమానికి ప్రభుత్వం మరింత కృషి చేయాలి

- తీదేడు గ్రామంలో మహిళా సమాఖ్య భవనం నిర్మాణం కోసం శంకుస్థాపన



**జయభేరి, చింతపల్లి :**

మహిళాల సంక్షేమానికి ప్రభుత్వం మరింత కృషి చేయాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు.చింతపల్లి మండలం తీదేడు (వెంకటంపేట) గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గ్రామ మహిళా సమాఖ్య భవన నిర్మాణం కోసం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో మహిళలు పురుషులతో పాటు సమానంగా రాణించాలని ఆమె అన్నారు.మాజీ సీఎం కేసీఆర్ మహిళల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని ఆమె గుర్తు చేశారు.ఆడబిడ్డ పెళ్లికి సహాయం పుట్టిన బిడ్డ నుండి ఇంటికీ చేర్చేవరకు దేశంలో మహిళలకు ఎక్కడ లేని విధంగా తెలంగాణాలో పథకాలు అమలయ్యాని ఆమె అన్నారు.మహిళలూ తలచుకుంటే సాధించలేనిది ఏమీ లేదు...నేలమీద నుండి అంతరిక్షంలోకి వెళ్ళేదాకా మహిళాలదే ఆధిపత్యం నడుస్తుందని ఆమె అన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలు దేశానికి ఆదర్శం అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్, మాజీ ఉప సర్పంచ్లు ఉలుపాల శేఖర్ రెడ్డి,ధరణిపతి రమణారావు,గ్రామ పాలక వర్గం సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, మాదగోని కృష్ణ గౌడ్, గంటెల అలివేలు సోమయ్య, దాసరి కళమ్మ ముత్తయ్య, రెడ్డి పద్మ పరమేష్ ముదిరాజ్,సందె లక్ష్మయ్య,మర్ల యాదగిరి, శివర్ల పర్వతాలు యాదవ్, గ్రామస్తులు మర్రు రామారావు,సిమర్ల శ్రీను యాదవ్,జూలురి శ్రీధర్,దాసరి తిరుపతయ్య,శివర్ల రాములు,వీరమల్ల వెంకటయ్య, వీరమల్ల సత్తయ్య,గంటెల ఆంజనేయులు,సందె శంకర్,ఉడుత చిన్న వెంకటయ్య,పంబాల చెన్నయ్య, కొన్రెడ్డి వద్దయ్య, సందె బిక్షం, కాటెపాక వెంకటయ్య, పి.ఆర్.టెన్నికల్ అసిస్టెంట్ మల్లేష్,పంచాయతీ కార్యదర్శి బాదిని అశోక్, ఫీల్డ్ అసిస్టెంట్ పంబాల చంద్రయ్య, వి.బి.కే లు గంటెల ఇందిరా,పంబాల అరుంధతి,సంఘబంధం అధ్యక్షురాలు ఆమనూరి మనీష కుమార్, తదితరులు పాల్గొన్నారు.




# తొలి మ్యాచ్‌లో చెన్నైపై సునాయాస విజయం

- రాయల్స్ బోణీ..
- సీఎస్‌కేకు ఘోర ఓటమి
- మెరిసిన జడ్డూ, వైభవ్

ఐపీఎల్ 19వ సీజన్‌ను రాజస్థాన్ రాయల్స్ ఘనంగా ఆరంభించింది. గువాహటిలోని బర్సపుర స్టేడియం వేదికగా సోమవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో రాయల్స్.. ఐదుసార్లు చాంపియన్స్ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)ను 8వికెట్ల తేడాతో ఓడించి సునాయాస విజయం సాధించింది. రవీంద్ర జడేజా (2/18), జోఫ్రా ఆర్చర్ (2/19), నండ్రె బర్గర్ (2/26)తో కూడిన రాజస్థాన్ బౌలింగ్ ధాటికి దారుణంగా విఫలమైన చెన్నై.. 19.4 ఓవర్లలో 127 పరుగులకే ఆలౌట్ అయింది. ఆ జట్టులో జెమీ ఓవర్టన్ (43) టాప్ స్కోరర్. స్వల్ప లక్ష్యాన్ని రాజస్థాన్.. 12.1 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. మూడు రోజుల క్రితమే 15వ పడిలోకి అడుగుపెట్టిన ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ (17 బంతుల్లో 52, 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) ధనాధన్ ఆటతో మ్యాచ్‌ను పూర్తి ఏకపక్షం చేసేశాడు.

సొంత వేదికలో టాస్ గెలిచి ప్రత్యర్థికి బ్యాటింగ్ అప్పగించిన రాజస్థాన్ రెగ్యులర్ సారథి రియాన్ పరాగ్ నిర్ణయం సరైనదే అని నిరూపిస్తూ ఆ జట్టు పేసర్లు ఆరంభం నుంచే నిప్పులు చెరిగారు. ఈ సీజన్‌లో రాజస్థాన్ నుంచి చెన్నైకి ట్రాన్స్‌ఫర్ అయిన సంజూ శాంసన్ (6) బర్గర్ రెండో ఓవర్లో వేసిన అద్భుత బంతికి క్లీన్‌బౌల్డ్ అయి అభిమానులను తీవ్ర నిరాశపరిచాడు. 2020 తర్వాత ఐపీఎల్ సీజన్ ఆరంభ మ్యాచ్‌లో అర్ధసెంచరీ చేయకపోవడం సంజూకు ఇదే మొదటిసారి. మూడో ఓవర్లో ఆర్చర్.. రుతురాజ్ (6)ను బౌల్డ్ చేశాడు.

బర్గర్ మరుసటి ఓవర్లో ఆయూశ్‌ను డకౌట్ చేయగా మాథ్యూ షార్ట్ (2) సందీప్ శర్మ బౌలింగ్‌లో నిష్క్రమించడంతో పవర్ ప్లేలో ఆ జట్టు 41/4తో నిలిచింది. 8వ ఓవర్లో బంతినందుకున్న జడేజా.. గత సీజన్ దాకా తాను ఆడిన ఫ్రాంచైజీపై కసితీర్చుకున్నాడా? అన్నట్టుగా ఒకే ఓవర్లో సర్ఫరాజ్ (17), దూబె (6) వికెట్లు పడగొట్టి చెన్నైని కోలుకోనీయకుండా చేశాడు. వేలంలో చెన్నై రూ. 14 కోట్లు ధర పెట్టి కొన్న కార్తీక్ శర్మ (18)ను బ్రిజేశ్ 11వ ఓవర్లో వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో చెన్నై కనీసం వంద పరుగులైనా చేస్తుందా? అనిపించింది. కానీ ఓవర్టన్ మెరుపులతో ఆ జట్టుకు గౌరవప్రదమైన స్కోరు దక్కింది.

స్వల్ప ఛేదనను రాజస్థాన్ పెద్దగా కష్టపడకుండానే పూర్తి చేసింది. ఎప్పట్లాగే వైభవ్.. ధనాధన్ మెరుపులతో పవర్ ప్లే ముగిసేసరికే ఆ జట్టు విజయం ఖాయం అయింది. ఎదుర్కొన్న తొలి బంతినే పుల్‌షాట్ ఆడబోయి మిడ్‌వికెట్ వద్ద కార్తీక్ క్యాచ్ మిస్ చేయడంతో బతికిపోయిన అతడు.. ఆ తర్వాత ఆగలేదు. హెన్రీ ఓవర్లో సిక్స్ బాదిన అతడు కంబోజ్ ఐదో ఓవర్లో 4,4,6 కొట్టాడు. నూర్ అహ్మద్‌కు రెండు సిక్స్‌లతో స్వాగతం పలికి 15 బంతుల్లోనే అర్ధ శతకాన్ని పూర్తిచేశాడు. ధాటిగా ఆడే క్రమంలో వైభవ్‌ను కంబోజ్ ఏడో ఓవర్లో ఔట్ చేసి చెన్నైకి బ్రేక్ ఇచ్చాడు. అతడి స్థానంలో వచ్చిన జురెల్ (18) వేగంగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలువలేదు. అయితే జైస్వాల్ (38 నాటౌట్), కెప్టెన్ పరాగ్ (14 నాటౌట్) మరో వికెట్ పడకుండా లాంఛనాన్ని పూర్తిచేశారు.

**సంక్షిప్త స్కోర్లు**

చెన్నై: 19.4 ఓవర్లలో 127 ఆలౌట్ (ఓవర్టన్ 43, కార్తీక్ 18, జడేజా 2/18, ఆర్చర్ 2/19);
రాజస్థాన్: 12.1 ఓవర్లలో 128/2 (వైభవ్ 52, జైస్వాల్ 38*, అన్షుల్ 2/27)




## మహికా శర్మకు 1.7 కోట్ల ఖరీదైన కారు గిఫ్ట్ ఇచ్చిన హార్దిక్ పాండ్యా

క్రికెటర్ హార్ధిక్ పాండ్యా తన గర్ల్‌ఫ్రెండ్‌కు ఓ ఖరీదైన లగ్జరీ కారును గిఫ్ట్‌గా ఇచ్చాడు. సుమారు 1.7 కోట్ల ఖరీదైన మెర్సిడీజ్ బెంజ్ వీ క్లాస్ కారును బహుమతిగా అందజేశాడు. స్టార్ ఆల్‌రౌండర్, ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా.. తన లగ్జరీ లైఫ్ స్టయిల్‌తో అందర్నీ అట్రాక్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే 12 కోట్ల ఖరీదైన అల్ట్రా లగ్జరీ ఫెరారీ కారును పాండ్యా సొంతం చేసుకున్నాడు. అయితే స్వల్ప గ్యాప్‌లోనే మళ్లీ గర్ల్‌ఫ్రెండ్ మహికాను సర్‌ప్రైజ్ చేశాడు. గిఫ్ట్ ఇచ్చిన కారుతో పాండ్యామహికా దిగిన ఫోటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఆ పిక్స్‌కు అతని ఫ్యాన్స్ రియాక్ట్ అవుతున్నారు. ఆదివారం ఐపీఎల్‌లో భాగంగా వాంఖడే స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ సారథ్యంలోని ముంబై జట్టు ఆరు వికెట్ల తేడాతో కోల్‌కతాపై విక్టరీ నమోదు చేసిన విషయం తెలిసిందే.




## పారా ఆర్చర్ ఆఫ్ ది ఇయర్‌గా శీతల్

భారత యువ పారా ఆర్చర్ శీతల్ దేవీకి అరుదైన గుర్తింపు దక్కింది. 19 ఏండ్ల ఈ జమ్మూకశ్మీర్ అమ్మాయి 2025 సంవత్సరానికి గాను 'పారా ఆర్చర్ ఆఫ్ ది ఇయర్'గా ఎంపికైనట్టు వరల్డ్ ఆర్చరీ ప్రకటించింది. నిరుడు గ్వాంగ్జూలో జరిగిన వరల్డ్ పారా ఆర్చరీ చాంపియన్‌సిప్‌లో స్వర్ణం గెలిచిన మొదటి మహిళా ఆర్మ్‌లెస్ (చేతుల్లేని) ఆర్చర్‌గా రికార్డులకెక్కిన ఆమె నిలకడగా రాణిస్తుండటంతో వరల్డ్ ఆర్చరీ శీతల్‌కు ఈ అవార్డును ప్రకటించింది.

వరల్డ్ చాంపియన్‌లో స్వర్ణమే గాక శీతల్.. పారిస్ పారాలింపిక్స్‌లో మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్యం, వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లోనే మహిళల టీమ్ సిల్వర్, మిక్స్‌డ్ టీమ్ కాంస్యంతో సత్తాచాటింది. ఇక 'ఆర్చర్ ఆఫ్ ది ఇయర్'గా టర్కీకి చెందిన ఎమిర్కన్ హేనీ ఎంపికైంది.



# మహిళల ఆరోగ్యానికి ఇవి శ్రీరామ రక్ష..

## రోజూ తీసుకుంటే ఊహించని అద్భుతాలు..

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మహిళలు రెట్టింపు బాధ్యతలను మోస్తున్నారు. అటు ఆఫీసు పని, ఇటు ఇంటి బాధ్యతలను చక్కబెట్టే క్రమంలో తమ సొంత ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం పరిపాటిగా మారింది. ఫలితంగా చిన్న వయసులోనే తీవ్రమైన అలసట, హార్మోన్ల అసమతుల్యత, ఒత్తిడి, నిద్రలేమి వంటి సమస్యలు చుట్టుముడుతున్నాయి. అయితే వీటన్నింటికీ మన పురాతన ఆయుర్వేదంలో అద్భుతమైన పరిష్కారాలు ఉన్నాయని ప్రముఖ హెల్త్ కోచ్ డింపుల్ జాంగ్డా సూచిస్తున్నారు. ప్రతి మహిళ తన ఆహారంలో భాగం చేసుకోవాల్సిన మూడు ముఖ్యమైన మూలికల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**అశ్వగంధ**

అశ్వగంధను కేవలం పురుషులకే పరిమితమైన మూలికగా చాలామంది భావిస్తారు. కానీ ఇది మహిళలకు ఒక సంజీవని లాంటిది. దీనిని అడాప్టోజెన్ అని పిలుస్తారు. ఇది శరీరంలో ఒత్తిడిని పెంచే కార్టిసాల్ హార్మోన్ స్థాయిలను తగ్గించి, నాడీ వ్యవస్థను ప్రశాంతపరుస్తుంది. థైరాయిడ్ గ్రంధి పనితీరును మెరుగుపరచడంలో, శరీరానికి తక్షణ శక్తిని ఇవ్వడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. మార్కెట్లో లభించే అశ్వగంధ పొడిని గోరువెచ్చని పాలలో కలుపుకుని లేదా హెర్బల్ టీ రూపంలో తీసుకోవచ్చు.

**శతావరి (ఆస్పరాగస్): స్త్రీలకు అసలైన నేస్తం**

ఆయుర్వేదంలో శతావరికి ఉన్న ప్రత్యేకతే వేరు. వంద రోగాలను నయం చేసే శక్తి దీని సొంతం. పీసీఓఎస్, సంతానలేమి, క్రమరహిత రుతుస్రావం వంటి సమస్యలతో బాధపడే మహిళలకు శతావరి అద్భుతంగా పనిచేస్తుంది. ఇది శరీరంలో ఈస్ట్రోజెన్ స్థాయిలను క్రమబద్ధీకరిస్తుంది. మీరు గర్భం దాల్చాలని ప్లాన్ చేస్తున్నా లేదా మెనోపాజ్‌లో ఉన్నా, శతావరి హార్మోన్లను అదుపులో ఉంచుతుంది. బాలింతలలో పాల ఉత్పత్తిని పెంచడానికి కూడా ఇది సహాయపడుతుంది. శతావరి పొడిని పాలు లేదా తేనెతో కలిపి రోజుకు ఒకసారి తీసుకోవడం శ్రేయస్కరం.

**తులసి: మానసిక ఉల్లాసానికి మారుపేరు**

ప్రతి ఇంట్లో ఉండే తులసి కేవలం పూజకే కాదు, ఔషధ గుణాల గని కూడా. తులసి శరీరంలో సెరోటోనిన్ విడుదలకు దోహదపడుతుంది. ఇది ఆందోళన, నిరాశను దూరం చేసి మనసును ఉల్లాసంగా ఉంచుతుంది.ఇది శరీరంలోని జీర్ణ అగ్నిని ప్రేరేపించి, జీవక్రియను వేగవంతం చేస్తుంది. దీనివల్ల బరువు తగ్గాలనుకునే వారికి, నీరసంగా ఉండేవారికి మంచి ఫలితం ఉంటుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో 34 ఆకులను నమలడం లేదా తులసి టీ తాగడం వల్ల ఊపిరితిత్తులు, జీర్ణాశయం ఆరోగ్యంగా ఉంటాయి.

**ముఖ్య గమనిక: నిపుణుల సూచన**

ఆయుర్వేద మూలికలు సహజమైనవే అయినప్పటికీ, ప్రతి ఒక్కరి శరీర తత్వం వేరుగా ఉంటుంది. కాబట్టి వీటిని మీ దినచర్యలో భాగం చేసుకునే ముందు ఒకసారి ఆయుర్వేద వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం. ముఖ్యంగా గర్భిణీలు, ఇతర మందులు వాడుతున్న వారు సరైన మోతాదు కోసం నిపుణుల సలహా తీసుకోవాలి.

ఆరోగ్యం అనేది బాధ్యత మాత్రమే కాదు, అది ఒక పెట్టుబడి. మహిళలు తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టినప్పుడే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుంది. ఈ మూడు మూలికలను సరైన పద్ధతిలో వాడి సహజసిద్ధమైన ఆరోగ్యాన్ని మీ సొంతం చేసుకోండి.



# మీ పొట్ట కొవ్వు కరగాలంటే ఏది బెస్ట్ ఎక్సర్‌సైజ్?

ఆరోగ్యంగా ఉండాలన్నా, బరువు తగ్గాలన్నా వ్యాయామం తప్పనిసరి. అందులోనూ వాకింగ్, రన్నింగ్ అత్యంత ప్రజాదరణ పొందిన మార్గాలు. అయితే, వీటిలో ఏది త్వరగా ఫలితాన్ని ఇస్తుంది? ముఖ్యంగా పొట్ట చుట్టూ పేరుకుపోయిన మొండి కొవ్వును కరిగించడానికి ఏ వ్యాయామం ఎలా సహాయపడుతుంది.? వయస్సు, ఫిట్‌నెస్ స్థాయి, ఆరోగ్య స్థితిని బట్టి ఏది ఎంచుకోవాలో ఈ చిట్కాలు స్పష్టం చేస్తాయి. బరువు తగ్గడానికి సిద్ధమవుతున్న వారికి ఇది ఒక సరైన గైడ్.మీ శరీరానికి ఏది సరిపోతుంది? అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.

**కేలరీల ఖర్చు:**

సాధారణంగా ఒక గంట పాటు వేగంగా నడవడం వల్ల సుమారు 200 నుండి 300 కేలరీలు ఖర్చవుతాయి. అదే ఒక గంట పాటు రన్నింగ్ చేస్తే 500 నుండి 800 కేలరీలు వరకు కరిగించవచ్చు. అంటే, తక్కువ సమయంలో ఎక్కువ కేలరీలు ఖర్చు చేయాలంటే రన్నింగ్ ఉత్తమ ఎంపిక.

**పొట్ట కొవ్వుపై ప్రభావం:**

పొట్ట చుట్టూ ఉన్న కొవ్వును కరిగించడానికి రన్నింగ్ చాలా వేగంగా పనిచేస్తుంది. ఇది శరీరంలోని మెటబాలిజం రేటును పెంచి, వ్యాయామం ముగిసిన తర్వాత కూడా కేలరీలు ఖర్చయ్యేలా చేస్తుంది. అయితే, నడక వల్ల కూడా క్రమంగా కొవ్వు తగ్గుతుంది, కానీ దీనికి ఎక్కువ సమయం పడుతుంది.

**నడక:**

వయసు పైబడిన వారు, అధిక బరువు (Obesity) ఉన్నవారు, కీళ్ల నొప్పులు లేదా గుండె సమస్యలు ఉన్నవారికి నడక సురక్షితం. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది.

**పరుగు:**

వేగంగా బరువు తగ్గాలనుకునే యువకులు, ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేనివారు రన్నింగ్ ఎంచుకోవచ్చు. ఇది ఎముకల బలాన్ని పెంచుతుంది.

**జాగింగ్ vs రన్నింగ్:**

రన్నింగ్ కంటే కొంచెం తక్కువ వేగంతో పరిగెత్తడాన్ని జాగింగ్ అంటారు. రన్నింగ్ చేయలేని వారు జాగింగ్‌తో ప్రారంభించి, నెమ్మదిగా వేగాన్ని పెంచవచ్చు.

**ముఖ్యమైన చిట్కాలు:**

ఏదో ఒక రోజు చేయడం కంటే, రోజూ కనీసం 3045 నిమిషాల పాటు వ్యాయామం చేయడం ముఖ్యం. కీళ్లపై ఒత్తిడి పడకుండా ఉండటానికి మంచి వాకింగ్ లేదా రన్నింగ్ షూస్ ధరించాలి. వ్యాయామంతో పాటు సరైన పోషకాహారం తీసుకున్నప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి. మీరు ఇప్పుడే ఫిట్‌నెస్ ప్రయాణాన్ని ప్రారంభిస్తుంటే, నడకతో మొదలుపెట్టి నెమ్మదిగా రన్నింగ్‌కు మారడం మంచిది. మీ లక్ష్యం కేవలం ఫిట్‌నెస్ అయితే నడక సరిపోతుంది. అదే బరువు తగ్గడం అయితే రన్నింగ్ లేదా జాగింగ్ మేలు.



# ఆరోగ్యకరమైన కళ్లను పొందండి!

**స్పష్టమైన కంటిచూపు కోసం 7 సులభమైన టిప్స్..**

ప్రస్తుతం డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర స్క్రీన్‌లు ఉపయోగించడం అనేది కంటి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తున్న విషయం తెలిసిందే. మనం ఎక్కువ సేపు స్క్రీన్‌ను చూసినా, కంటి కండరాలు అలసిపోతాయి, కళ్ళు పొడిబారతాయి. అంతేగాక, చూపు సమస్యలు పెరిగిపోతాయి. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం సరైన జీవనశైలి, పోషకాహారం, కొన్ని చిట్కాలు పాటించాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

**1. 20-20-20 సూత్రం:**

అందరికీ తెలిసిన 202020 రూల్‌ని పాటించడం ద్వారా స్క్రీన్ చూడడం వల్ల కంటి కండరాలపై పడ్డ ఒత్తిడిని తగ్గించవచ్చు.

ప్రతి 20 నిమిషాలకు స్క్రీన్ చూడటం ఆపాలి. కనీసం 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును 20 సెకన్ల పాటు గమనించాలి. ఈ అలవాటు కంటి కండరాలకు విశ్రాంతి ఇచ్చి, కళ్ళు పొడిబారడం, అలసటను తగ్గిస్తుంది.

**2. సరైన భంగిమ:**

స్క్రీన్ కళ్లకు కనీసం ఒక చేతి దూరంలో ఉండాలి. స్క్రీన్ కంటి స్థాయికి కాస్త దిగువగా ఉండేలా పొజిషన్ చేయాలి. గదిలో తగినంత వెలుతురు ఉండాలి, మరీ చీకటి లేదా మరీ ఎక్కువ కాంతి ఉండకూడదు.

**3. కనురెప్పలు వాల్చడం:**

స్క్రీన్ ఉపయోగిస్తున్నప్పుడు కనురెప్పలు సరిగ్గా వాల్చడం చాలా ముఖ్యం. మీరు కనీసం 60% తక్కువగా కనురెప్పలు వాల్చే అవకాశం ఉంటుంది. కనురెప్పలు వాల్చడం వల్ల కళ్ళు తేమగా ఉంటాయి, కళ్ల పొడిబారడం తగ్గుతుంది.

**4. నిద్ర, హైడ్రేషన్:**

ప్రతిరోజూ 7-9 గంటల పాటు నిద్రపోవాలి. నిద్రలేమి వల్ల కళ్ళలో పొడిబారడం, కనురెప్పలు అవడం, దృష్టి మసకబారడం వంటి సమస్యలు వస్తాయి. ప్రతిరోజూ 8-10 గ్లాసుల నీరు తాగాలి. డీహైడ్రేషన్ వల్ల కూడా కళ్ళు పొడిబారతాయి.

**5. UV రక్షణ:**

బయట ఉన్నప్పుడు UV రక్షణ ఉన్న సన్‌గ్లాసెస్ ధరించండి. ఇది కంటి శుక్లాలు, రెటీనా సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**6. పోకాహారం**

కంటి ఆరోగ్యం ఆహారంపై ఆధారపడి ఉంటుంది. కంటికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన పోషకాలు:

**విటమిన్ A:** క్యారెట్లు, బొప్పాయి

**లూటిన్ & జింక్:** ఆకుకూరలు (పాలకూర), గింజలు

**ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్స్:** చేపలు, వాల్‌నట్స్, విత్తనాలు

**సిట్రస్ పండ్లు:** నారింజ, నిమ్మ


**7. కంటి వ్యాయామాలు**

**కనురెప్పలు ఆర్పడం:** కళ్ళను 10-15 సార్లు వేగంగా ఆర్పండి. ఆ తర్వాత కళ్ళు మూసి విశ్రాంతి తీసుకోండి.

**కనుబొమ్మలను తిప్పడం:** కళ్ళను నెమ్మదిగా వృత్తాకారంలో తిప్పండి. మొదట క్లాక్ వైజ్, తర్వాత యాంటీ క్లాక్ వైజ్.

**దృష్టిని మార్చడం:** మీ బొటనవేలును ముఖం దగ్గర ఉంచి దానిపై దృష్టి పెట్టండి, తర్వాత దూరంగా ఉన్న వస్తువుపై దృష్టి పెట్టండి.

ఈ చిట్కాలు కంటిపై ఒత్తిడిని తగ్గించి, చూపు దెబ్బతినకుండా కాపాడతాయి. అయితే, కంటి సమస్యలు సీరియస్‌గా మారితే.. వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.





## మదర్ హుడ్ ను ఎంజాయ్ చేస్తున్న కియారా అద్వాని


మహేష్ బాబు 'భరత్ అనే నేను', రామ్ చరణ్ 'వినయ విధేయ రామ' & 'గేమ్ ఛేంజర్' సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు తెలిసిన బాలీవుడ్ హీరోయిన్ కియారా అద్వానీ ప్రస్తుతం మదర్ హుడ్ను ఎంజాయ్ చేస్తున్నారు. బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాను పెళ్లి చేసుకున్న ఆవిడ... ఆ మధ్య ఓ బిడ్డకు జన్మనిచ్చారు. ఇప్పుడు తన ఆలోచనలు, జీవితాన్ని చూసే విధానం పూర్తిగా మారిపోయిందని తెలిపారు. పెళ్లి, డెలివరీ తర్వాత జీవితంలో చాలా మార్పులు వచ్చాయని, అయితే కొన్ని విషయాలు ఇప్పటికీ మునుపటిలాగే ఉన్నాయని కియారా పేర్కొన్నారు. కియారా అద్వానీ సినిమాల విషయానికి వస్తే... రాకింగ్ స్టార్ 'టాక్సిక్'తో వెండితెరపై రీ ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. ఆ సినిమాలో ఆమె 'నాడియా' పాత్రలో సందడి చేయనున్నారు. 'టాక్సిక్'లో కియారాతో పాటు నయనతార, హుమా ఖురేషి, రుక్మిణి వసంత్ హీరోయిన్లుగా కనిపించనున్నారు. సినిమా జూన్ 4న థియేటర్లలో విడుదలకు సిద్ధం అవుతోంది.



## ఊహించినట్టుగానే టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న సల్మాన్ ఖాన్..

భారతీయ సినీ పరిశ్రమలో పాన్ ఇండియా ట్రెండ్ మరింత బలపడుతున్న తరుణంలో టాలీవుడ్‌బాలీవుడ్ కలయికలో మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టబడింది. టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి, బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్‌తో చేతులు కలపడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మించనుండగా, అధికారిక ప్రకటన మార్చి 30న వెలువడింది. ఈ ప్రాజెక్ట్‌పై గత కొంతకాలంగా వినిపిస్తున్న రూమర్లకు తెరదించుతూ స్వయంగా సల్మాన్ ఖాన్ తన సోషల్ మీడియా ద్వారా అనౌన్స్ చేశారు. "దిల్, దిమాగ్, జిగర్ సే... ఫ్రమ్ దిస్ ఏప్రిల్" అంటూ చేసిన పోస్టు ఫ్యాన్స్‌కు ఫుల్ కిక్ ఇచ్చింది. ఈ ట్యాగ్‌లైన్ చూస్తుంటే సినిమా యాక్షన్, ఎమోషన్ మేళవింపుగా ఉండబోతుందని స్పష్టమవుతోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని దిల్ రాజు తన బ్యానర్‌పై భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. టాలీవుడ్‌బాలీవుడ్ కలయికలో వస్తున్న ఈ మూవీ కోసం ఎక్కడా రాజీపడకుండా హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో రూపొందించనున్నారు. కోప్రొడ్యూసర్లుగా కుల్దీప్ రాథోడ్, రఫీ ఖాజీ వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రీప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. ముంబైలో భారీ సెట్లు కూడా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాను 2027లో భారీ స్థాయిలో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. హీరోయిన్, మ్యూజిక్ డైరెక్టర్ తదితర వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 2007లో 'మున్నా' సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన వంశీ పైడిపల్లి , 'బృందావనం', 'ఎవడు', 'ఊపిరి', 'మహర్షి', 'వారసుడు' వంటి విజయవంతమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కేవలం కొద్దిపాటి సినిమాలే చేసినా, భారీ స్టార్లతో పనిచేసి తన మార్క్ చూపించారు. ఇక ప్రస్తుతం సల్మాన్ ఖాన్ 'మాతృభూమి' ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్నారు. ఆ సినిమా పూర్తయ్యాక పూర్తిస్థాయిలో ఈ ప్రాజెక్ట్‌పై దృష్టి పెట్టనున్నారు. టాలీవుడ్ మేకింగ్ స్టైల్‌లో సల్మాన్‌ను ఎలా ప్రెజెంట్ చేస్తారో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## మలయాళ దర్శకుడితో 'ఏఏ25'?



అగ్రహీరో అల్లు అర్జున్ ప్రస్తుతం తన 22వ సినిమాతో బిజీగా ఉన్నారు. అట్లీ దర్శకత్వంలో 'ఏఏ22' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ సైన్స్ ఫిక్షన్ సినిమా ఇప్పటికే అరవైశాతానికిపైగా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. దీని తర్వాత లోకేష్ కనకరాజ్, సుకుమార్ చిత్రాలను బన్నీ అంగీకరించారు. తాజాగా ఈ లైనప్‌లో మరో సినిమా చేరింది. మలయాళ దర్శకుడు బాసిల్ జోసెఫ్ దర్శకత్వంలో అల్లు అర్జున్ తన 25వ చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని నేషనల్ మీడియాలో వార్తలొస్తున్నాయి. సూపర్‌హీరో చిత్రం 'మిన్నాల్ మురళి'తో మంచి గుర్తింపును తెచ్చుకున్నారు బాసిల్ జోసెఫ్. కామెడీ, ఫాంటసీ, యాక్షన్ అంశాలతో జనరంజకంగా చిత్రాల్ని తీర్చిదిద్దుతాడని ఆయనకు పేరుంది. ఇటీవలే బాసిల్ జోసఫ్ వినిపించిన కథకు బన్నీ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారని, తుది నిర్ణయం ఇంకా వెలువడాల్సి ఉందని తెలుగు ఫిల్మ్‌వర్గాల్లో వినిపిస్తున్నది. అన్నీ కుదిరితే వచ్చే ఏడాది ద్వితీయార్థంలో సుకుమార్ సినిమాతో సమాంతరంగా 'ఏఏ25' తెరకెక్కే అవకాశముందని టాక్. అయితే ఈ వార్తలో నిజానిజాలేంటో తెలియాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.

## పెద్ది మరోసారి వాయిదా పడనుందా..?





మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ పెద్ది. ఈ సినిమా కోసం మెగా అభిమానులంతా ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. పెద్ది సినిమా పై ఇప్పటికే భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి. గేమ్ ఛేంజర్ లాంటి డిజాస్టర్ తర్వాత చరణ్ నటిస్తున్న సినిమా కావడంతో ఈ సినిమాలో అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్నారు. ఇక పెద్ది సినిమాకు బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే.. ఉప్పెన సినిమాతో భారీ హిట్ అందుకున్నాడు బుచ్చిబాబు. ఉప్పెన సినిమా తర్వాత గ్యాప్ తీసుకున్న బుచ్చిబాబు ఇప్పుడు పెద్ది సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. పెద్ది సినిమాలో చరణ్ మాస్ లుక్ లో కనిపించనున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్ దగ్గర నుంచి సాంగ్స్ సినిమాపై అంచనాలు పెంచాయి.

ఆమె హీరోయినా.. అస్సలు వద్దు..! డైరెక్టర్‌కు మొహం మీదే చెప్పిన విజయ్ సేతుపతి

పెద్ది సినిమా రిలీజ్ కోసం ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సినిమా రిలీజ్ డేట్ వాయిదా పడుతుండటంతో ఫ్యాన్స్ నిరాశ వ్యక్తం చేస్తున్నారు. మార్చి 27న చరణ్ పుట్టినరోజున 'పెద్ది' రిలీజ్ చేస్తామని మొదట్లో వ్యక్తం చేస్తున్నారు. కానీ ఆతర్వాత సినిమాను వాయిదా వేశారు. ఏప్రిల్ 30న పెద్ది సినిమాను విడుదల చేస్తాం అని అనౌన్స్ చేశారు. చరణ్ పుట్టిన రోజున ఓ వీడియో టీజర్ ను విడుదల చేశారు.

ఇదిలా ఉంటే పెద్ది సినిమా మరోసారి వాయిదా పడనుందని టాక్ వినిపిస్తుంది. ఓ మూవీ ఈవెంట్ లో మాట్లాడుతూ 'పెద్ది' కొత్త విడుదల తేదీని బయటపెట్టేశాడు నిర్మాత ఎస్కేఎన్. జూన్ 25న 'పెద్ది' సినిమా థియేటర్లలోకి తీసుకురాబోతున్నారట. సినిమా షూటింగ్ పెండింగ్ ఉండటంతో పాటు ఇటీవలే చరణ్ కంటికి గాయం కావడంతో సినిమా ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఐటమ్ సాంగ్‌తో పాటు మరో పాట షూటింగ్ పెండింగ్‌లో ఉందట. ఇదిలా ఉంటే పెద్ది సినిమా తర్వాత రిలీజ్ కోసం చిన్న సినిమాలు రెడీగా ఉన్నాయి. అఖిల్ లెనిన్'ని జూన్ 26కి రావాల్సి ఉంది. ఇప్పుడు పెద్ది దెబ్బకు మే 1కి షిఫ్ట్ అయ్యే ఛాన్స్ ఉంది. అలాగే నిఖిల్ నటిస్తున్న స్వయంభు కూడా పెద్ది తర్వాత రిలీజ్ అవ్వడానికి సిద్ధంగా ఉంది. తరుణ్ భాస్కర్ 'గాయపడ్డ సింహం' సినిమా కూడా రిలీజ్ కోసం వెయిట్ చేస్తుంది. పెద్ది తర్వాత ఈ సినిమాలన్నీ లైన్ లో ఉన్నాయి.



## చీరకట్టులో చూడముచ్చటగా..

తెలుగు ముద్దుగుమ్మ ఈషా రెబ్బా ఎప్పటినుంచో సాలిడ్ హిట్ కోసం ఎదురుచూస్తుంది. వరుసగా సినిమాలు చేస్తున్నా హిట్స్ మాత్రం అందుకోలేకపోతోంది ఈ చిన్నది. హీరోయిన్ గా సినిమాలు చేస్తూనే సెకండ్ హీరోయిన్ గానూ నటిస్తూ మెప్పిస్తుంది. చిన్న చిన్న సినిమాల్లో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ వయ్యారికి ఇప్పటివరకు సరైన బ్రేక్ మాత్రం రాలేదు. అలాగే పెద్ద స్టార్ హీరోల సినిమాల్లో సెకండ్ హీరోయిన్ గా కనిపించింది. ఒక్క హిట్ పడితే కెరీర్ టర్న్ అవుతుందని ఎదురుచూస్తుంది ఈ అందాల భామ. అంతకుముందు ఆ తర్వాత సినిమాతో కథానాయికగా తెలుగు తెరకు పరిచయమైన ఈ అమ్మడు.. ఆతర్వాత వరుసగా అమీ తుమీ, విస్మయం, బ్రాండ్ బాబు వంటి చిత్రాల్లో నటించింది. కానీ అనుకుంత గుర్తింపు తెచ్చుకోలేకపోయింది. ఆ తర్వాత ఎన్టీఆర్ సినిమాలో నటించింది. ఎన్టీఆర్ నటించిన అరవింద సమేత వీర రాఘవ మూవీలోనూ మెరిసింది. కానీ ఈ సినిమా హిట్ అయినప్పటికీ ఈషాకు అంతగా క్రేజ్ రాలేదు. ఆతర్వాత వెబ్ సిరీస్ ల్లోనూ నటించింది ఈ అందాల భామ. ఇక ఇటీవలే తరుణ్ భాస్కర్ తో కలిసి సినిమా చేసింది. కానీ ఈ సినిమా కూడా ఆకట్టుకోలేకపోయింది. ఇక ఈ బ్యూటీ సోషల్ మీడియాలో షేర్ చేసే ఫోటోలకు నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోలకు కుర్రకారు ఫిదా అవుతున్నారు. చీరకట్టులో అదరగొట్టింది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**